సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా



# రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



**- జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి**

**పెద్దాపురం, రూరల్ మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపురం మండలంలో ఈ నెల 22 నుంచి నవంబర్ 21వ తేది వరకు నిర్వహించే గ్రామ రెవెన్యూ సభలలో భాగంగా శుక్రవారం మండలంలోని పులిమేరు గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో, సర్పంచ్ తుమ్మల సురేఖ నాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొని మాట్లాడుతూ రైతులు రీ సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. తహశీల్దార్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ రీ సర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా సర్వే పూర్తి అయిన గ్రామాలలో వివిధ భూ సమస్యలపై గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని, కావున ఈ గ్రామ సభలకు రైతులు పాల్గొని అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కూటమి నాయకులు, రైతులు, మండల సర్వేయర్ సామోరు, వీఆర్వో హర్ష, రైతులు, తదితరులు పాల్గొన్నారు. ఈ గ్రామసభలో 14 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ కార్యాలయం తెలిపింది.

# రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి రాజ్యం..!

**- పైసలిస్తే..దేనికైనా నో అబ్జెక్షన్...**
**- నకళ్ళు, ఇసిలు, రిటర్న్ డాక్యుమెంటు జారీలోనూ తాత్సారం..**
**- డాక్యుమెంట్ స్కానింగ్‌లోనూ ఇదే తంతు.**
**- రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక ప్రహసనమే...**





**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు తయారైంది సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల పరిస్థితి. ఇటీవల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయాలలో సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది బదిలీలు కావడంతో నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు పైసలిస్తేనే పనులు జరిగేట్టు తయారయ్యాయి. దీంతో సబ్ రిజిస్టార్ శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది.. ఎక్కడికక్కడ పనులలో తాత్సారం వహిస్తూ పైసలు కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అమలాపురం, ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల పరిస్థితి మరీ దారుణంగా తయారైనట్లు కక్షిదారులు ఆరోపణలు చేస్తున్నారు.

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇటీవల రాష్ట్రానికి అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ అయిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని జిల్లాలో సబ్ రిజిస్ట్రార్లు బదిలీలు జరిగాయి. అయితే అమలాపురం, ముమ్మిడివరం, అంబాజీపేట, మామిడికుదురు, కొత్తపేట, ఆత్రేయపురం, ఐ.పోలవరం తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్‌లు చేయాలంటే అటు దస్తావేజు లేఖర్లు, ఇటు క్రయ, విక్రయదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దస్తావేజులు తయరీదారులు రిజిస్ట్రేషన్‌కి అన్నీ సిద్దం చేసి కార్యాలయానికి వెళితే అక్కడ నిరాశే మిగిలుతుందని వారు వాపోతున్నారు. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు అందరూ సిండికేట్ అయ్యి ఒక దస్తావేజుకు ఒక రేటును, మరొక దస్తావేజు చేసినందుకు మరొక రేటు చొప్పున ముందు ధరను నిర్ణయించి పైసా వసూలు చేసే కార్యాలయాలు మారాయి. దీంతో అమలాపురంలోని కొంతమంది దస్తావేజు లేఖరులు ఇక్కడ రిజిస్ట్రారులకు వేలాది రూపాయిలు ఇవ్వలేక అంబాజీపేట, కొత్తపేట, ఆత్రేయపురం తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్‌లు చేయించడానికి వెళితే.... ఆయా ప్రాంతాల నుండి సంబంధిత ఆస్థి ఉన్న రిజిస్ట్రారు కేంద్రంలో ఉన్న సబ్ రిజిస్ట్రారు ఆ దస్తావేజుకు ఆన్‌లైన్‌లో అన్ని పరిశీలించి మళ్ళీ తిరిగి ఆ ఫైల్‌ను పంపాల్సి ఉంటుంది. అయితే అలా ఆన్‌లైన్‌లో వచ్చిన దస్తావేజుకు కూడా లేనిపోని సాకులు చూపుతూ దానికీ బేరసాలు సాగిస్తున్నారు.

దీంతో క్రయ,విక్రయదారులు, దస్తావేజు లేఖరులు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే ఇసి, మార్కెట్ వాల్యూ, నకళ్ళు, సర్చ్ రిపోర్టులకు ప్రభుత్వం నిర్ధేశించిన ధరలు కంటే అధిక మొత్తంలో వసూళ్ళు చేస్తున్నారని కక్షిదారులు వాపోతున్నారు. అంతేకాకుండా మ్యారేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కూడా అధిక మొత్తంలో రిజిస్ట్రారు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే అడిగినంత ఇవ్వలేక దీంతో కొంతమంది లేఖర్లు,క్రయ విక్రయదారులు రిజిస్ట్రేషనులను వాయిదా వేసుకుంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా రిజిస్ట్రారుగాని సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రైవేటు లేఖరులు, క్రయ విక్రయదారులు, ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

**పూర్వార్జిత ఆస్తుల్లోనూ...:** ముఖ్యంగా పూర్వార్జితపు ఆస్తుల విషయంలో సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు భారీఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.10లక్షల లోపు ఆస్తికి ఒక రేటు, రూ.15లక్షల లోపు ఆస్తికి మరొక రేటు, ఇలా వాల్యూను బట్టి రూ.10వేలు నుంచి రూ.20వేలు వరకూ డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అలాగే పూర్వార్జితపు ఆస్తికి రిజిస్ట్రేషన్‌కు వెళితే ఎఫ్‌ఎంసి, మరియు డెత్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా జత చేయాలని చెబుతున్నప్పటికీ మామూళ్లు ముట్టచెబితే మాత్రం అవన్నీ అవసరం లేదన్నట్లు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఇటీవల జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే ఎక్కడెక్కడ రిజిస్ట్రేషన్లు జరిగాయో తేటతెల్లమవుతోంది.

## బాస్కెట్ బాల్ పోటీలలో రామచంద్రపురం డిగ్రీ కాలేజ్ ప్రతిభ



**రాజానగరం, మేజర్ న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన ఇంటర్ కాలేజీయట్ బాస్కెట్ బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ శుక్రవారంతో ముగిసాయి. ఈ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డ్ ఇన్చార్జ్ సెక్రటరీ ఆచార్య జి.సుధాకర్ హాజరై విజేతల జట్టు పేర్లను ప్రకటించారు. మొదటి స్థానంలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ రామచంద్రపురం, రెండవ స్థానంలో డి.ఆర్.కె. రెడ్డి కాలేజ్ జి.మామిడాడ, మూడవ స్థానంలో ఎస్.వి.కె.పి. కాలేజ్ పెనుగొండ, నాలుగవ స్థానంలో సి.ఆర్.ఆర్. కాలేజ్ ఏలూరు నిలిచాయని ప్రకటించారు. జట్టు క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. రెండు రోజుల పాటు యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ కాలేజీయట్ బాస్కెట్ బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ కు ఆయా కళాశాలల నుండి 13 టీమ్స్, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. వీరిలో ప్రతిభ కనపరచిన 12 మంది క్రీడాకారులను మరియు అదనంగా నాలుగురు క్రీడాకారులను ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టుగా ఎంపిక చేసారని తెలిపారు. ఈ టీమ్ నవంబర్ 1 నుండి 5 వరకు బెంగళూరులో క్రిస్ట్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారని అన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభతో నన్నయ విశ్వవిద్యాలయానికి మరింత గుర్తింపు తీసుకురావాలని రిజిస్ట్రార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.ఎం.వి.ఎస్.ఎస్.మూర్తి, సెలక్షన్ కమిటీ మెంబర్స్ రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, అబ్జర్వర్ పి ఆర్ కాలేజ్ పీడీ రమణ, కోర్సు కోఆర్డినేటర్ డా.కె.బాలసత్య నారాయణ, డా.ఎ.సత్యనారాయణ, డా.బి.రామ్ గోపాల్, డేవిడ్ మరియు పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

## జాబ్ మేళా ద్వారా నూతనంగా 17 మందికి ఉపాధి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి సంస్థ, ప్రభుత్వ ఐ.టి.ఐ, ధవళేశ్వరం అధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించుటకు గాను జరిగిన జాబ్ మేళా" తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరులోని ధవలేశ్వరం ఐటిఐ ప్రాంగణంలో "జాబ్ మేళ" నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నైపణ్యాధికారి గంటా సుధాకర్ మరియు జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రభుత్వ ఐటిఐ రాధాకృష్ణన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళాలు ఉద్యోగ అవకా శాలు కల్పిస్తున్నాయని,అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 3 కంపెనీలు పాల్గొన్నాయని 59 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 17 మంది ఎంపిక అయ్యా రని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు డిస్ట్రిక్ట్ ఎంప్లాయి ుమెంట్ ఆఫీసర్ హరీష్ చంద్ర ప్రసాద్ ,జిల్లా నైపుణ్యాధికారి గంటా సుధాకర్ , ఏడిఎస్‌డిఒ పెరుమాళ్,కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ యం విష్ణు బాబు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ సురేష్ గండి, జిల్లా నియామక అధికారిణి డి.పావని ప్రియ పాల్గొన్నారు.

## నిరుపేదలకు టిట్కో గృహాలను అందజేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని మూడు నిరుపేద కుటుంబాలకు టిడ్కో గృహాలు అందజేయడం జరిగిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శుక్రవారం రామచంద్రపురం కొత్తూరులో ముగ్గురు నిరుపేదలకు టిట్కో గృహాలను అందజేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. తొలుత రిబ్బన్ కట్ చేసి ముగ్గురు లబ్ధిదారుల కుటుంబాలతో మంత్రి గృహప్రవేశం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం పట్టణంలోని మూడు నిరుపేద కుటుంబాలకు టేట్కో గృహాలు మంజూరు చేసి అలాట్మెంట్ లెటర్లు అందించడం జరిగిందన్నారు. వీరిలో మామిడి దుర్గమ్మ కుటుంబం రామచంద్రపురం పట్టణం పెద్ద వంతెన దగ్గర గల వెల్ల రోడ్డు చెట్టు కింద గత పది సంవత్సరాలుగా సిమెంటు తూర లో నివాసముంటున్నారని వారికి గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈరోజు సింగిల్ బెడ్ రూమ్ టిట్కో గృహాన్ని కేటాయించడం జరిగిందన్నారు. రామచంద్రపురం పట్టణానికే చెందిన చిన్న వయసులోనే భర్త చనిపోయి ఇబ్బందులు పడుతున్న దోమలపాటి నవిత, నిరుపేదరాలైన కొమ్మూరి ప్రమీల కు కూడా సింగిల్ బెడ్ రూమ్ టిట్కో గృహాలను అందజేశామన్నారు. వీరందరికీ అలాట్మెంట్ లెటర్లతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయలు బట్టలు దుప్పట్లు కూడా ఇచ్చినట్టు మంత్రి తెలిపారు. చిన్న వయసులోనే భర్తలు చనిపోయి నిరుపేదలుగా ఉన్న మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు వారిచేత చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు రామచంద్రపురం నియోజకవర్గంలో చిన్న వయసులోనే భర్త చనిపోయి జీవనోపాధి లేక నిరుపేదలుగా ఉన్న మహిళలను 120 మందిని గుర్తించామని తెలిపారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ సహకారంతో 90 శాతం రాయితీతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. మిగిలిన 10 శాతం లబ్ధిదారుల తరఫున ఆయనే స్వయంగా భరిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్, రామచంద్రపురం నియోజకవర్గ పోలిశెట్టి చంద్రశేఖర్, కంచమర్తి బాబురావు మున్సిపల్ కమిషనర్ ఓమ్మి అయ్యప్ప నాయుడు, టిడ్కో సివిల్టిసి బిందు మాధవి, ప్రజా ప్రతినిధులు అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం రామచంద్రపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని క్యాంప్ ఆఫీసులో అందించారు. రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామానికి చెందిన అనుసూరి రాంబాబు, రామచంద్రపురం పట్టణానికి చెందిన గుత్తుల ముత్యాల రాజు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం చేయాలని గత సెప్టెంబర్ నెలలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రినిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారి అనారోగ్య సమస్యలను గుర్తించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కుల రూపంలో నిధులు విడుదల చేసింది.ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 40 వేల రూపాయల చెక్కును అనుసూరి రాంబాబుకు, 75,699 రూపాయల చెక్కును గుత్తుల ముత్యాల రాజుకు మంత్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

**- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆయా శాఖల అధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సూచించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల సెక్టార్ అధికారులతో అభివృద్ధి పనులపై ఐటీడీఏ పీవో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సింహాచలం మాట్లాడుతూ ముందుగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి పనులు, నాబార్డ్, ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటివరకు ఎన్ని పనులు మంజూరు చేసింది ఎన్ని రోడ్డు పనులు ప్రారంభించారు, ఎన్ని పనులు పూర్తి చేసారు, ఎన్ని పనులు పూర్తి చేయాల్సి ఉందో సంబంధిత అధికారులు ద్వారా ఆరా తీశారు. అదేవిధంగా ఫారెస్ట్ క్లియరెన్స్ కు ఎన్ని రోడ్లు పెండింగ్ లో ఉన్నవి ఆయన ఆరా తీశారు. ఐటీడీఏ ఉద్యానవన శాఖ ద్వారా ఇప్పటివరకు గిరిజన రైతులకు ఏ మొక్కలు సరఫరా చేసింది, ఎన్ని మొక్కలు సరఫరా చేసింది, ఇంకా ఎన్ని మొక్కలు సరఫరా చేయవలసి ఉన్నది వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా ఎన్ని ఎకరాలలో రబ్బరు ప్లాంటేషన్ వేసింది ఆయన ఆరా తీశారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో సికెల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులు ఎంతమంది ఉన్నది, ఎంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించింది, అదేవిధంగా వ్యాధిగ్రస్తులకు హెల్త్ కార్డులు ఎంతమందికి జారీ చేసారో ఆరా తీశారు. ఏజెన్సీలో ఎంతమందికి టీబి పరీక్షలు చేసింది ఎంతమందిని గుర్తించింది ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలో అన్ని పాఠశాలలో విద్యార్థులకు నెల నెలా వైద్య పరీక్షలు ఆరు నెలల్లో ఎంతమందికి నిర్వహించింది, అదేవిధంగా ఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బర్త్ వెయిటింగ్ హాల్స్ ఉన్నవి అదేవిధంగా ప్రస్తుతం ఎంత మంది గర్భిణీ స్త్రీలు ఉన్నది అదేవిధంగా ఆస్పత్రులలో ఎంతమంది గర్భిణీ స్త్రీలకు డెలివరీలు చేసింది వైద్యాధికారుల ద్వారా ఆయన ఆరా తీశారు. ఐసిడిఎస్ ద్వారా ఏజెన్సీలో అన్ని అంగన్వాడీ కేంద్రాలలో బాల బాలికలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం ఏ విధంగా అందజేస్తున్నారు, అదేవిధంగా ఎంతమంది బాలబాలికలకు, ఎంతమంది గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం సరఫరా చేయుచున్నది పిఓ ఆరా తీశారు. గిరిజన సంక్షేమశాఖ, ఏజెన్సీ విద్యాశాఖ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో గిరిజన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఏవిధంగా పాఠాలు చెబుతున్నారు, అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ పక్కగా అమలు చేయాలన్నారు. ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులకు బేస్ లైన్ శిక్షణ కార్యక్రమం ఇప్పటివరకు ఎంతమందికి ఇచ్చింది ఇంకా ఎంతమందికి శిక్షణ ఇవ్వవలసివున్నది వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా మార్గదర్శి ప్రోగ్రాం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులకు పై చదువులు చదువుకునే విధంగా ఎంతమంది విద్యార్థులకు అవగాహన కల్పించింది ఆయన ఆరా తీశారు. స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ద్వారా ఎన్ని పనులు గుర్తించింది ఆయన ఆరా తీశారు. వ్యవసాయ శాఖ ద్వారా ఏజెన్సీలోని ఎంతమంది గిరిజన రైతులకు ఇ-క్రాపింగ్ బుకింగ్ చేసింది అదేవిధంగా ఈ సంవత్సరం ఎంతమంది రైతులు వరి సాగు చేయుచున్నది ఆయన ఆరా తీశారు. వెలుగు ద్వారా ఏజెన్సీలో మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఏ కార్యక్రమాలు నిర్వహించుచున్నది, అదేవిధంగా ఎన్ని మహిళా సంఘాలు, ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నది సంబంధిత అధికారులను ఐటీడీఏ పీవో ఆరా తీశారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఎస్ఓ మార్తమ్మ, సిడిపిఓ సంధ్యారాణి, పిహెచ్ఓ చిట్టిబాబు, పివో రాంబాబు, ఏడిఏ లు సి.హెచ్.కె.వి.చౌదరి, కే.సావిత్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సుబ్బయ్య, డిఇ లు చైతన్య, శ్రీనివాసరావు, రాజేంద్రబాబు, సూపర్డెంట్ బి.కిషోర్, వెలుగు ఏపిడి దేగలయ్య, యాంకర్ పర్సన్ రామరాజు, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

# మూడు సిలెండర్లు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

**- జాయింట్ కలెక్టర్ నిషాంతి**




**అమలాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకం అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. శుక్రవారం అమరావతి నుండి పౌరసరఫరాలశాఖ కమిషనర్ జి.వీర పాండ్యన్ మరియు డిసిఎస్ మనజీర్ జిలానిలు జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, చౌక ధరల దుకాణాలు నిర్వహణ, ధరల నియంత్రణ అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లా డుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న గ్యాస్ కనెక్షన్ నెంబరు ఆధార్ నెంబరు, రైస్ కార్డు నెంబరు డేటాబేస్‌లో ఉన్నవారు ఈ పథకానికి అర్హులవుతారన్నారు. అటువంటి డేటాను డిపార్ట్మెంట్ డేటాతో సరిపోల్చుకున్నాక అర్హులుగా నిర్ధారించబడతారన్నారు.అర్హులైన లబ్ధిదారులు ఈనెల 29 నుండి మార్చి 30వ తారీఖు లోపు ఒకటి సిలిండర్ బుక్ చేసుకోవాలన్నారు. ఆ విధంగా బుక్ చేసుకున్న సిలిండర్‌కు లబ్ధిదారుడు ధరను ఆన్లైన్‌లోగాని ఆఫ్లైన్లో గాని చెల్లించాలన్నారు. ఆ సిలిండర్ లబ్ధిదారునికి ఇవ్వబడ్డ తర్వాత అతని అకౌంట్లో ఆయిల్ కంపెనీ వారి సబ్సిడీ జమచేస్తారన్నారు. లబ్ధిదారునికి 24 గంటల లోపల సబ్సిడీ సొమ్ములు జమ చేయబడుతుందన్నారు. ఈ సంవత్సరం ఒక సిలిండర్ పొందాక ఆ వినియోగదారులకి వచ్చే సంవత్సరం మూడు బ్లాకుల్లో ఉచిత సిలిండర్లు అందజేయబడతాయన్నారు. ఏప్రిల్, ఆగస్టు, మార్చి నెలలో ఈ బ్లాకులు ప్రారంభమవుతాయనీ, ఈ పథకంలో ఏ కారణం చేతనైన పేరు మిస్ అయితే వారు సంబంధిత గ్యాస్ కంపెనీని సంప్రదించవచ్చుననీ ఆమె స్పష్టం చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించి రాండమైజేషన్ ప్రక్రియను రద్దు చేయడం మూలంగా రైతులు తమకు ఇష్టం వచ్చిన మిల్లులను ఎంపిక చేసుకుని ఆరు గాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని రైతులు తరలించి అమ్ముకునే వెసులుబాటు ఉందన్నారు. ధాన్యం విక్రయించే రైతులకు మొబైల్ ఫోన్లకు ఐదు సంక్షిప్త మెసేజ్లు (ఎస్ఎంఎస్)లు కొనుగోలుకు సంబంధించి ఎప్పటి కప్పుడు తెలియజేయడం జరుగుతుందన్నారు.

రైతులు బహిరంగ మార్కెట్లో తాము పండించిన ధాన్యానికి అధిక ధర లభించినట్లయితే అమ్ముకోవచ్చునని కానీ ఆ యొక్క ధాన్యం వివరాలను సంబం ధిత రైతు సేవ కేంద్రాలలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నవంబర్ ఆరో తేదీ నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లాలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. కందిపప్పు, పంచదార నవంబర్ మాసానికి అందుబాటులో ఉంచడం జరిగిందని, ఎడిబుల్ ఆయిల్స్ ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాల సరస్వతి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.


## పేరాబత్తులను గెలిపిద్దాం

**- ఎమ్మెల్యే అనందరావు**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల అనందరావు అన్నారు. అమలాపురం మెట్ల రమణబాబు స్వగృహంలో శుక్రవారం జరిగిన ఎన్‌డిఏ కూటమి నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ లు మాట్లాడుతూ తమ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్ల రమణబాబు, పెచ్చేట్టి చంద్ర మౌళి, పెచ్చేట్టి బాబు, యాళ్ల దొరబాబు, మోకా సుబ్బారావు, ఏడిద శ్రీను, లింగోలు పండు, తిక్కిరెడ్డి నేతాజీ, అల్లాడ స్వామి నాయుడు, నల్లా స్వామి, సుదా చిన్నా, ఆర్.డి.ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సంపద కేంద్రంను సందర్శించిన విద్యార్థులు



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం మండలం జి.రాగంపేటలో వర్మి కంపోస్టు (చెత్త నుండి సంపద తయారి) కేంద్రాన్ని శుక్రవారం పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జి స్కూల్ విద్యార్థులు సందర్శించారు. గ్రామ టిడిపి అధ్యక్షులు జల్దాని సుబ్రహ్మణ్యం (బాబీ) దీనిలో భాగంగా విద్యార్థులకు వర్మి కంపోస్టు తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్స్, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పశుగణన ప్రారంభం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పలుగ్రామాల్లో శుక్రవారం పశువైద్య సిబ్బంది పశుగణన ప్రారంభించారు. రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 28 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి పశువైద్య సిబ్బంది సర్వే నిర్వహించి వారివద్ద వున్న గేదెలు, ఆవులు, పెంపుడు కుక్కలు మేకలు వివరాలు సేకరిస్తారు. మెర్లపాలెంలో పశు గణన కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మెర్ల రాము, ఎంపీటీసీ మెర్ల వీరబాబు ప్రారంభించారు. గుండబోగుల రామకృష్ణ, గ్రామ పశువైద్యాదికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌లను పరిశీలించిన ఎంపిడిఓ



పెద్దాపురం, రూరల్ మేజర్‌న్యూస్: పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురం, కట్టమూరు, గుడివాడ, సిరివాడ, మర్లావ, కాండ్రకోట గ్రామాలలో శుక్రవారం ఎంపిడిఓ డి.శ్రీలలిత, సిడిపిఓ జి.ఉషలు అంగన్‌వాడీ సెంటర్‌లను పరిశీలించారు. ఆయా గ్రామాలలో గల అంగన్‌వాడీ కేంద్రాలను పోషణ్ వాటికలు ఏర్పాటు విషయంపై ప్రతిపాదిత స్థలములను వారు పరిశీలించడం జరిగింది. వారి వెంట పంచాయతీ సెక్రటరీ ఎం.డి.సుభాని, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు.

# పిఠాపురంలో...జంతువుల కొవ్వుతో నెయ్యి తయారీ...!

- **జంతువుల కొవ్వు, కళేబరాలనుండి నుండి నెయ్యి తయారు చేస్తున్న కేటుగాళ్లు**
- **కల్తి నెయ్యి కేంద్రంపై దాడి చేసి 265 కేజీల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్న అధికారులు**
- **ఆలయాల్లో దీపారాధన నుండి తిను పదార్థాల వరకు అన్నింటా కల్తీ**
- **పిఠాపురం పట్టణంలో పదుల సంఖ్యలో కల్తీ నెయ్యి కేంద్రాలు**
- **జంతువుల కొవ్వు నూనె దీపారాధనకు వినియోగించడంపై హిందూ సంఘాల ఆగ్రహం**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** కల్తీ కల్తీ కల్తీ... ఇప్పుడు అన్నింటా కల్తీ. మీరు బయట ఆహార పదార్థాలు బిర్యానీలు వంటి ఆశగా తింటున్నారా...? అయితే జంతువుల కొవ్వు నుండి, కళేబరాల నుండి తయారు చేయబడిన నకిలీ నూనెలు మీ పొట్టలో చేరినట్టే, తీయని తీపి పదార్థాలు అమ్మే షాపులలో తినుబండారాలను మీ పిల్లలకు పెడుతున్నారా...? అయితే జంతువుల కొవ్వు నుండి తయారు చేయబడిన నకిలీ డాల్డా, నెయ్యి వారికి ప్రేమగా తినిపిస్తున్నట్టే. మీరు అత్యంత భక్తిశ్రద్ధలతో దేవుణ్ణి ఆరాధించేందుకు దీపారాధన నూనె ఏ కంపెనీ నుండి వచ్చిందో తెలియకుండా కొంటున్నారా...? అయితే జంతు కళేబరాలనుండి తయారు చేయబడిన దీపారాధన నూనెతో దీపం వెలిగించి పాపం చేసినట్టే.

ఆధ్యాత్మిక కేంద్రం పిఠాపురంలో జంతువులను వధించి వాటి కొవ్వు, కళేబరాలనుండి నకిలీ నూనెలు, దీపారాధనకు ఉపయోగించే దీపారాధన నూనెలు, తినే ఆహార పదార్థాలలో అత్యధికంగా ఉపయోగించే డాల్డా, నెయ్యి తయారు చేసే కుటీర పరిశ్రమలు పదుల సంఖ్యలో ఉండటం ఆవేదన కలిగించే అంశం. స్థానిక మున్సిపల్ కమిషనర్ నామ కనకారావుకు రాబడిన సమాచారం మేరకు మున్సిపల్ రెవిన్యూ పోలీసు సిబ్బందితో కలిసి స్థానిక లైన్స్ క్లబ్ ఏరియా పద్మావతి నగర్ లో గల ఒక ఇంటిపై దాడి చేసి సుమారు 265 కేజీల జంతువుల కొవ్వు నుండి తయారుచేయబడిన పలురకాల నూనెలు, తినుబండాలలో ఉపయోగించే డాల్డాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో పిఠాపురం పట్టణం ఒకసారిగాఉలిక్కిపడింది.ఎక్కడోఏదో జరుగుతుందని ఇంతకాలం విన్నాం కానీ... పిఠాపురం పట్టణంలోనే ఇంత భారీ స్థాయిలో కల్తీ జరుగుతుందని ఊహించలేకపోయామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టుబడింది కేవలం ఒక చిన్న కేంద్రం మాత్రమేనని, రోజుకి సుమారు 1000 కేజీల వరకు ఉత్పత్తి చేసే భారీ కేంద్రాలు పిఠాపురం పట్టణంలోనే ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు.

**-ఇతర ప్రాంతాలకు సరఫరా...** ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణం కేంద్రంగా కల్తీనెయ్యి కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. జంతువులను వధించి వాటి కొవ్వు నుండి, కళేబరాల నుండి తయారు చేయబడిన పలు రకాల నూనెలు, ఆహార పదార్థాలలో ఉపయోగించే డాల్డా వంటి పదార్థాలు తయారుచేసి స్థానికంగా అమ్మకాలు సాగించడమే కాకుండా... ఆర్టీసీ బస్సుల ద్వారా ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. పిఠాపురం నుండి శ్రీకాకుళం,పలాస,ఇచ్ఛాపురంవంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

**-పవన్ కళ్యాణ్ స్పందించాలని...** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో ఇటువంటి కల్తి నెయ్యి కేంద్రాలు ఉండడం దారుణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తిరుమలలో కల్తి నెయ్యి ఘటనలో తీవ్రంగా స్పందించిన పవన్ కళ్యాణ్... తిరుమల పవిత్రతను కాపాడతానని నడుం బిగించారు. అదే నేపథ్యంలో... తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో జరుగుతున్న కల్తీ నెయ్యి కేంద్రాలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని, అత్యంత పవిత్రంగా దీపారాధనకు ఉపయోగించే నూనెలను సైతం చంటిలో కొవ్వు కొలేబరాలను తయారు చేస్తున్న అక్రమ వ్యాపారులపై చర్యలు చేపట్టి ఆధ్యాత్మిక కేంద్ర పవిత్రతను కాపాడాలని భక్తులు, నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

**-పట్టుబడిన కల్తీ నెయ్యిని సీజ్ చేసాం : కనకారావు (కమిషనర్)**
తమకు రావడని సమాచారం మేరకు లైన్స్ క్లబ్ ఏరియాలో గల పద్మావతి నగర్ లో ఒక ఇంటిపై దాడి చేసి జంతువుల కొవ్వు కళేబరాల నుండి తయారుచేసిన సుమారు 265 డాల్డా, నెయ్యి వంటి పదార్థాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, స్వాధీనం చేసుకున్న పదార్థాన్ని డంపింగ్ యార్డ్ కి తరలిస్తామని పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు తెలిపారు.

**-అత్యంత బాధాకరం : వెంకటేశ్వరరావు (విశ్వహిందూ పరిషత్)**
హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో భగవంతుని కృపకు పాత్రులు కావడానికి దీపారాధన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారని, అటువంటి దీపారాధనకు ఉపయోగించే నూనెలను జంతువుల కొవ్వు కళేబరాల నుండే తయారు చేయడం అత్యంత దారుణమని, ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలో ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని, ఎలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, ఆధ్యాత్మిక కేంద్ర పవిత్రతను కాపాడాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు వెంకటేశ్వరరావు కోరారు.

## కాకినాడ పార్లమెంట్ పరిధిలో రైల్వేస్టేషన్ల అభివృద్ధి కేంద్రం గ్రీన్ సిగ్నల్

- **ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో నిధులు మంజూరుకు కేంద్రం ఓకే**
- **త్వరలో పనులు ప్రారంభం**
- **కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ పార్లమెంట్ పరిధిలో పలు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం అంగీకారం తెలిపిందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కాకినాడ జిల్లాలో కాకినాడ, తుని, సామర్లకోట రైల్వే స్టేషన్లను అత్యధునిక హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్ట్ లు,రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రధాని మోడీ, రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన కేంద్రం నిధులు మంజూ రు చేసిందని తెలిపారు. ఆమోదం తెలిపిన పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు ఖరారు చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని రైల్వే శాఖ మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే రాజధాని అమరావతికి రూ.2,275 కోట్లతో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయడం శుభపరిణామన్నారు. 57 కి.మీ. కొత్త రైల్వే లైన్ నిర్మాణం దేశంలో ప్రధాన మెట్రో నగరాలను, ఏపీలో ప్రధాన పోర్టులకు అనుసంధానం చేయడం వల్ల రాజధాని శరవేగంగా అభివృద్ధి చెందడంతో పాటు, పారిశ్రామిక అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషితో ఏపీలో రైల్వే ప్రాజెక్టల అభివృద్ధికి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం పట్ల ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

## డిప్యూటీ తాసిల్దార్‌గా రామచంద్రమూర్తి




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మండల డిప్యూటి తహశీల్దార్‌గా రాపాక దుర్గా రామచంద్రమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తపేట తహశీల్దార్ ఆఫీసు నుండి బదిలీ పై వచ్చారు.

ఇంతవరకు ఇక్కడ పని చేసిన డిప్యూటీ తాసిల్దార్ మహమ్మద్ ఇస్మాయిల్ అంబాజీపేట సివిల్ సప్లయ్ డిప్యూటి తహశీల్దార్ గా బదిలీ పై వెళ్ళారు. రామచంద్రమూర్తి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరమే పరిస్కరిస్తాను అని తెలిపారు. రామచంద్రమూర్తి,కి తహసీల్దార్ రాజేశ్వరరావు మరియు ఆఫీసు సిబ్బంది, వీఆర్వో లు అభినందనలు తెలియజేశారు.

## కార్మికులు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభ్యులు సగృహం నందు శ్రీ వినాయక డీప్ వాటర్ పోర్ట్ కార్మిక సభ్యులకు కొండబాబు చేతుల మీదుగా వినాయక డీప్ వాటర్ పోర్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఓలేటి పాండురంగడు, సెక్రటరీ బలసాడ శ్రీను సమక్షంలో డ్యూటీ మరియు బోనస్ సొమ్ములను అందజేశారు.

ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ 2019లో ఎన్నికల్లో వినాయక డీప్ వాటర్ పోర్టు వర్కర్స్ సభ్యులు తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చారని నెపంతో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వినాయక కార్మిక సభ్యులను అనేక ఇబ్బందులు గురి చేయడం జరిగిందని, రాజకీయ కక్షతో కార్మిక సభ్యులకు అందవలసిన వేతనం బోనస్ లను కూడా నిలిపివేశారని, నేడు కూటమి ప్రభుత్వంలో శ్రీ వినాయక డీప్ వాటర్ పోర్ట్ యూనియన్ గత పాలకులు రాజకీయ కక్ష సాధింపు చర్యలో నిలిపివేసిన వేతనం, బోనస్ లను నేడు 29 సభ్యులకు సుమారు 8,050 రూపాయలు చొప్పున అందజేయడం జరుగుతుందని, గత వైసిపి పాలనలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు ఇల్లును కూడా కూల్చడం జరిగిందని, గత ప్రభుత్వం చేపట్టిన కక్ష సాధింపులో కాకినాడ నగర ప్రజలు,వ్యాపార వర్గాలుకార్మికులు అనేక విధాలుగా ఇబ్బందులకు గురయ్యారని, నేడు కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు కార్మికులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక డీప్ వాటర్ పోర్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఓలేటి పాండురంగడు, బలసాడి శ్రీను, పాలేపు ధర్మారావు, చిన్నబ్బాయి, ఈశ్వరరావు, తాతీలు పాల్గొన్నారు.

## రాజమండ్రి - కాకినాడ కెనాల్ రోడ్డుకు మోక్షం



**-మరమ్మత్తు పనులు ప్రారంభించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి**

**అనపర్తి, మేజర్ న్యూస్ :**కొన్ని సంవత్సరంల నుండి అద్వాన స్థితిలో ఉండి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న రాజమండ్రి టు కాకినాడ కెనాల్ రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే చొరవతో అటికలకు మోక్షం లభించింది. శుక్రవారం రోడ్డు మరమ్మతు పనులను స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మన జిల్లాకు ప్రధాన సమస్యల్లో ఒకటైన రాజమండ్రి - కాకినాడ కెనాల్ రోడ్ అద్వాన్నంగా తయారవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని, గత 12 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా 230 కోట్ల రూపాయలతో నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ పూర్తి కాలేదని, తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రోడ్ నిర్మాణంపై దృష్టి సాధించినప్పటికీ టెండర్ వేసిన సంస్థ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో తిరిగి వేరే టెండర్ ఇవ్వడానికి అవకాశం లేకపోవడంతో ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసామన్నారు.గత వైసిపి ప్రభుత్వం కనీసం రోడ్డు మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోడ్డు మొత్తం పూర్తిస్థాయిలో పాడవడం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు ప్రాముఖ్యతను తెలుపుతూ నేషనల్ హైవే గా మార్చాలని ప్రతిపాదనలు పంపామని, రాష్ట్రంలో చేపట్టిన ఆరు రోడ్లలో కూడా ఒకటిగా చేర్చాలని ప్రతిపాదనలను పంపామన్నారు.వాటి పనులు మొదలయ్యేసరికి సుమారు రెండు సంవత్సరాల సమయం పట్టవచ్చని, అప్పటివరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా సుమారు 6.5 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారని ఈ నిధులతో కడియం బిక్కవోలు జోన్ రోడ్డు మరమ్మతులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం ఎన్డీఏ నాయకులు, అనపర్తి టౌన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి 2025 ఫిబ్రవరి, 28 వరకు 21వ అఖిల భారత పశుగణన ప్రక్రియ

– జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



కాకినాడ, మేజర్ న్యూస్ : జిల్లాలో అక్టోబర్ 25 నుంచి వచ్చే ఏడాది 2025 ఫిబ్రవరి 28 వరకు 21వ అఖిల భారత పశుగణన ప్రక్రియ జరుగుతుందని ఈ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు గణన ప్రక్రియను శుక్రవారం కాకినాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు,ఇతర అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి 2025 ఫిబ్రవరి, 28 వరకు నిర్వహించే 21వ అఖిల భారత పశుగణన ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది కాకినాడ జిల్లాలోని ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను నమోదు చేస్తారన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి వికసిత్ ఆంధ్ర ప్రణాళిక రూపకల్పనకు ఈ పశుగణన ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. ఈ పశుగణన భారతదేశం అంతటా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందన్నారు. సాధారణంగా అన్ని సాధుజంతువుల యొక్క వివరాలు అనగా గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, పోనీస్ గాడిదలు మిథున్స్ యాక్స్, కంచర గాడిదలు, ఒంటెలు, ఏనుగులు, కుక్కలు మరియు కుందేళ్లు, పక్షిజాతులైన కోళ్లు, బాతులు, టర్కీకోళ్లు, మరియు ఇతర పెంపుడు జంతువుల వివరాలు గణన చేస్తారన్నారు. ఇందుకు కాకినాడ జిల్లాలో ఉన్న 21 మండలాలకు అవసరమైన సిబ్బందిని, సూపర్వైజర్లు నియమించి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో 296మంది ఎన్యుమరేటర్స్, 54 మంది సూపర్వైజర్లు నియమించిడం జరిగిందన్నారు. ఆయన తెలిపారు.

దేశవ్యాప్తంగా చేపట్టిన 21వ అఖిలభారత పశుగణన ప్రక్రియపై పాడి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం 21వ అఖిలభారత పశుగణన ప్రక్రియపై రూపొందించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్.. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీ డా.కె.కృష్ణమూర్తి, ఏడి డా. ఎన్.నిర్మల, డా. ఎం.దినకర్, పశుగణన జిల్లా నోడల్ అధికారి డా. జీ.గిరీష్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సుభాష్

**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** భారతదేశంలో, రాష్ట్రంలో ఉన్న పశు సంపదను పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర కార్మికశాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. భారతదేశ 21వ పశు గణన కార్యక్రమం శుక్రవారం పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఈ పశుగణన కార్యక్రమం అక్టోబర్ 25న ప్రారంభమై వచ్చే ఏడాది 2025 ఫిబ్రవరి 28 కి ముగిస్తారని అన్నారు. భారతదేశంలో, అలాగే ఆంధ్ర రాష్ట్రంలో ఎన్ని పశువులు ఉన్నాయి, పశు సంపదలో మన దేశం రాష్ట్రం ఏ స్థానంలో ఉంది తెలుసుకునేందుకు ఈ పశు గణన ఉపయోగపడుతుందన్నారు. అలాగే పశుసంపదను బట్టి బడ్జెట్ కేటాయింపులు కూడా జరుగుతాయి అన్నారు.

పశువులకు ఇచ్చే వ్యాక్సిన్, పాలు గుడ్లు మాంసం మనకు సరిపడా ఉత్పత్తి ఉందా లేదా అనే అంశాలు కూడా పశు గణన ద్వారా తెలుస్తుంది అన్నారు.తొలుత పశు గణన సర్వేకు సంబంధించిన పోస్టర్స్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఓ.రామకృష్ణ, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ విజయదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరం

**- డాక్టర్ బాంధవి**
**- అనపర్తి సిడిఆర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**



**అనపర్తి,మేజర్‌న్యూస్:** అమ్మతనంలోనే కమ్మదనాన్ని ఆస్వాదించాలని పెళ్లయిన ప్రతి స్త్రీ పరితపిస్తుంటారు. ప్రస్తుత తరుణంలో అనేక కారణముల విషయం అనేకమంది దంపతులకు సంతానలేమితో బాధపడుతున్నారు. ఈ తరుణంలో అనపర్తి లోని ప్రముఖ హాస్పిటల్ అయిన సి డి ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయబోతున్నారని సిడిఆర్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ డాక్టర్ కె.బాంధవీ తెలిపారు. అనపర్తి సిడిఆర్ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డా. బాంధవి మాట్లాడుతూ సంతాన లేమితో బాధపడుతున్న దంపతులు ఎందరో ఉంటున్నారని వాతావరణం కాలుష్యం వల్లగాని, ఆలస్య ంగా వివాహం చేసుకోవడం వల్లగాని, ఇతరత్రా ఆరోగ్య సమస్యల వల్లగాని, దంపతులకు సంతాన సాఫల్యత పై కొన్ని ఇబ్బందులు ఉంటున్నాయని వారికి ఈ ఉచిత శిబిరం సువర్ణ అవకాశమని ఈ ఉచిత వైద్య శిబిరంలో సంతానం కావలసినవారు ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చునని, అవసరమైనటువంటి పరీక్షల పైన కూడా ప్రత్యేక మైన డిస్కౌంట్లు కూడా ఇస్తున్నామని, ఉచిత డాక్టర్స్ కన్సల్టేషన్, ఉచిత ఫర్టిలిటీ త్రీడీ స్కానింగ్, అందిస్తున్నామని అంతర్జాతీయ స్థాయిలో వైద్య సదుపాయాలు ఇప్పుడు తమ వద్ద ఉన్నాయని డాక్టర్ కే బాంధవీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు సిడిఆర్ హాస్పిటల్ అధినేత కే సునీల్ కుమార్ రెడ్డి మరియు డాక్టర్ ఎస్ ఆశ నిర్మల స్త్రీల మరియు ప్రసూతి వైద్య నిపుణులు, డాక్టర్ టి అరుణ దేవి ప్రసూతి వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 'సేఫ్ దీపావళి' ప్రచార కార్యక్రమం



కాకినాడ, మేజర్ న్యూస్ : సమీపిస్తున్న దీపావళి పండుగ సందర్భంగా, కాకినాడలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రంగా రాయ మెడికల్ కళాశాల ప్లాస్టిక్, పునర్నిర్మాణ మరియు కాలిన గాయాల శస్త్రచికిత్స విభాగం డాక్టర్ బి.రత్న భూషణ్ నాయకత్వంలో క్రాకర్ కాలిన గాయాల నివారణ మరియు ప్రమాదవశాత్తు గాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సేఫ్ దీపావళి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ డి.ఎస్.వి.ఎల్. నరసింహం, డీఎమ్ఈ & ప్రిన్సిపాల్, ఆర్ఎమ్‌సి, సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లవణ్య కుమారి, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ విశ్వ వర్షన్ మరియు డాక్టర్ శేషి మరియు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ మద్దతుగా ఉన్నారు. దీపావళి వేడుకలు పిల్లల కాలిన గాయాలకు మరింత ముప్పుగా ఉంటాయని మరియు కొన్ని గాయాలు ప్రాణాంతకమని తెలియజేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. విద్యార్థులకు సురక్షిత దీపావళి అలవాట్ల ప్రాముఖ్యతను చెప్పి, పర్యావరణ స్నేహీ దీపావళిని జరుపుకోవాలని ప్రోత్సహించారు. దీపావళి రోజున చేయవలసినవి మరియు చేయరానివి గురించి వివరించారు మరియు ప్రమాదవశాత్తు గాయాలపై మొదటి చికిత్స చర్యలపై వారి సందేహాలను నివృత్తి చేశారు.పిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు ఎల్లప్పుడూ తల్లిదండ్రులు వారి పక్కన ఉండాలని, చెప్పులు మరియు కళ్ళజోడు ధరించాలని, మూసివున్న ప్రదేశాలలో బాణాసంచా కాల్చడం నివారించాలని సూచించారు. అదేవిధంగా ఇంటి మరియు పెంపుడు జంతువులను బాణాసంచాల నుండి రక్షించాలని, బాణాసంచా ఆడే ప్రదేశం దగ్గర నీటి వనరును ఎల్లప్పుడూ ఉంచాలని, ఎల్లప్పుడూ పత్తి బట్టలు మాత్రమే ధరించాలని సూచించారు. కాలిన బాణాసంచాలను వెంటనే నీటి బకెట్‌లో వేయవద్దని, శరీరానికి సమీపంగా బాణాసంచా వెలిగించవద్దని, కాలిన మరియు కాలకపోయిన బాణాసంచాలపై ముఖం ఉంచవద్దని, చిన్న వీధుల్లో రాకెట్లు కాల్చవద్దని, అధిక పొగ మరియు శబ్దం కలిగిన బాణాసంచాలు కాల్చవద్దని తెలియజేశారు.ప్రథమ చికిత్స గురించి చెబుతూ...వ్యక్తిని వెంటనే మంటల నుండి దూరంగా తీసుకెళ్ళాలని, గాయం క్షుణ్ణంగా కనీసం 15-20 నిమిషాల పాటు నీటితో కడగాలని, ప్లాస్టిక్ సర్జన్ లేదా సర్జన్‌ను వెంటనే సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మరియు రంగా రాయ మెడికల్ కాలేజీ నర్సింగ్ కళాశాల యొక్క ఎన్ఎస్ఎస్ విభాగం ఈ ప్రచార కార్యక్రమంలో సక్రియంగా పాల్గొంది. ఈ ప్రచారాన్ని దీపావళి వరకు కాకినాడలోని వివిధ స్థానిక పాఠశాలల్లో కొనసాగించబడుతుంది.

## చికిత్స పొందుతున్న యువకుడు మృతి

**అమలాపురం, మేజర్ న్యూస్ :** తల్లిదండ్రులు మందలించారని మనస్థాపంతో యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంకు చెందిన తాడాల దుర్గాప్రసాద్ (25) తల్లిదండ్రులతో కలిసి ముమ్మిడివరం పోలీస్ క్వార్టర్స్ వెనుక నివసిస్తున్నాడు. ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

దుర్గాప్రసాద్‌కు సోదరి అనారోగ్యం గురవటంతో పుట్టింటి దగ్గరే ఉండి వైద్య సేవలు పొందుతుంది. వైద్య సేవలకు డబ్బులు లేకపోవడంతో దుర్గ ప్రసాద్ తల్లిదండ్రులు సొమ్ములు ఇవ్వట్లేదని అతనిని మందలించడంతో ఈనెల 23న గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి లోను అవటంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడనుండి నుండి మెరుగైన వైద్య సేవలకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేపట్టారు.

# నేటి నుండి ఫిబ్రవరి 28 వరకు పశు గణన



– పోస్టర్‌ను ఆవిష్కరించిన కమీషనర్, ఎంపిడిఓ, పశు సంవదర్ధక శాఖ ఏడి

పెద్దాపురం, రూరల్ మేజర్‌న్యూస్ : శుక్రవారం పెద్దాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.తుమ్మల ఎన్.వి.ఎ.రామస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం నుండి ఫిబ్రవరి 28 వరకు 21వ అఖిల భారత పశు గణనలో భాగంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం పెద్దాపురం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి, ఎంపిడిఓ డి.శ్రీలలితల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక ఏడి మాట్లాడుతూ గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, కోళ్ళతో పాటు 16 రకాల పెంపుడు జంతువుల సమాచారం వెటర్నరి సిబ్బంది పట్టణాలలో, గృహ, గృహేతర వ్యక్తుల నుండి వివరాలు తీసుకోవడం జరుగుతుందని, పశుగణన పూర్తి అయిన ప్రతీ ఇంటిపై స్టిక్కర్ వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా భాను



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా ఎం.భాను శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రామచంద్రాపురం ఆర్డీవో ఆఫీసు నుండి బదిలీ పై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా పని చేసిన భవాని కొత్తపేట తహసీల్దార్ ఆఫీసుకి బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా భాను రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరమే పరిస్కరిస్తాను అని తెలియజేశారు. భానుకి తహసీల్దార్ రాజేశ్వరరావు, ఆఫీసు సిబ్బంది, వీఆర్వో లు అభినందనలు తెలియజేశారు.

# పర్యాటకులకు శుభవార్త.. నేటి (అక్టోబర్ 26) నుండి అధ్యాత్మిక యాత్రకు శ్రీకారం

- ప్రముఖ అధ్యాత్మిక దేవాలయాలు, పంచారామ క్షేత్రాలు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశామని వెల్లడించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
-అసెంబ్లీలో శాసనసభ్యుల సూచనల మేరకు ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్న మంత్రి కందుల దుర్గేష్
-భక్తులకు అధ్యాత్మిక సాంత్వనను అందించేందుకు 6 పుణ్య క్షేత్రాలతో అధ్యాత్మిక యాత్రను పర్యాటకులకు అందిస్తున్నామన్న మంత్రి
-కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం,వాడపల్లి ఆలయాలను కలుపుతూ ప్రతి శనివారం అందుబాటులో బస్సులు.. పర్యాటకుల రద్దీ, డిమాండ్ దృష్ట్యా ఆదివారం కూడా బస్సులు ఏర్పాటు చేసే యోచన ఉందని తెలిపిన మంత్రి దుర్గేష్
-రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ వద్ద టూరిజం శాఖకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం (ఐఆర్ఓ) వద్ద ఉదయం 6 గం.లకు బస్సులు ప్రారంభం.. రాత్రి 7.30కి ముగియనున్న ప్రయాణం..
-మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం శాఖ ఉన్నతాధికారులు, బోర్డ్ డైరెక్టర్ల చేతుల మీదుగా నేటి నుండే బస్సులు ప్రారంభం
-పెద్దలకు రూ.1,000, 3-10 ఏళ్ల వయస్సు గల చిన్నారులకు రూ. 800 టికెట్.. ప్రకృతి రమణీయత, అధ్యాత్మిక కలయికగా ఉన్న టూర్ ప్యాకేజీని యాత్రికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరిన మంత్రి దుర్గేష్
-యాత్రికులకు సౌలభ్యంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్న మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** యాత్రికుల హృదయాలకు, మనస్సులకు అధ్యాత్మిక సాంత్వనను అందించేందుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు అధ్యాత్మిక ప్రయాణ పర్యాటక ప్యాకేజీని నేటి నుండి (అక్టోబర్ 26) ప్రారంభించబోతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనసభలో పలువురు ఎమ్మెల్యేల సూచనల మేరకు వారాంతంలో ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు, పంచారామ క్షేత్రాలను కలిపేలా ఒక రోజు టూర్ ప్యాకేజీని ప్రవేశపెట్టామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో తనతో



పాటు ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ,టూరిజంశాఖ ఉన్నతాధికారులు, బోర్డ్ డైరెక్టర్ల చేతుల మీదుగా బస్సులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ టూర్ ప్యాకేజీ వివరాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటకానికి ముఖద్వారమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలుత అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతన క్షేత్రమైన కోరుకొండ స్వయం భూ శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి దేవస్థానం దర్శించిన అనంతరం రత్నగిరి కొండపై వెలసి భక్తుల కోరికలు తీరుస్తూ కొంగు బంగారంగా నిలిచిన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ దర్శనం, ఆ తర్వాత పితృముక్తి క్షేత్రంగా, పాదగయ తీర్థంగా పేరొందిన పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయం దర్శించిన పిమ్మట విశాలమైన ప్రాకారాలతో, చాళక్యుల శిల్పకళా నైపుణ్యంతో అలరారుతూ పంచారామ క్షేత్రాల్లో ఒకటైన సామర్లకోటలోని శ్రీ చాళుక్య కుమారరామ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు దర్శించుకొంటారని తెలిపారు.

సామర్లకోట దేవాలయంలో మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరించిన అనంతరం అత్యంత ప్రాచీన మహిమాన్విత శివ లింగ క్షేత్రం ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు సందర్శిస్తారని తెలిపారు. ఆ తర్వాత కోనసీమ తిరుపతిగా, ఏడు శనివారాల వెంకన్న దేవుడిగా భక్తులచే కీర్తి పొంది విశేషంగా ఆకట్టుకుంటున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని యాత్రికులు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీని నిర్ణయించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. అక్టోబర్ 26 నుండి బస్సులు పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్ వద్ద పర్యాటక శాఖకు సంబంధించిన సమాచార మరియు రిజర్వేషన్ కేంద్రం వద్ద ప్రతి శనివారం ఉదయం 6 గంటలకు బయలుదేరే పర్యాటకుల బస్సు కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాల మీదుగా రాత్రి 7.00 గంటలకు రాజమహేంద్రవరంలోని హేవలాక్ బ్రిడ్జి దగ్గర పుష్కర్ ఘాట్ కు చేరుకుంటుందన్నారు. అక్కడే పవిత్ర గోదావరి నదికి కన్నుల పండువగా హారతి ఇచ్చే ప్రాంతంలో మంత్ర ముగ్ధ దృశ్యాలను భక్తులు తిలకించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. భక్తులు అధ్యాత్మిక ప్రపంచంలో మునిగి తేలేలా కార్యక్రమం పూర్తయిన అనంతరం 7.30 గంటలకు తిరిగి రాజమహేంద్రవరంలోని ఏపీటీడీసీకి చెందిన ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం వద్దకు భక్తులను చేరవేస్తామన్నారు. ఇంతటితో యాత్ర సమాప్తమవుతుందన్నారు. వివరాలకు యాత్రికులు ఐఆర్ఓను సంప్రదించాలని తెలిపారు.

18 మంది సీటింగ్ సామర్థ్యంతో బయలుదేరే బస్సు ఆద్యంతం ప్రకృతి రమణీయత దృశ్యాల నడుమప్రయాణించేలాప్రణాళిక రూపొందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న ఈ అధ్యాత్మిక యాత్ర భక్తులకు మానసికోల్లాసాన్ని కలిగించి అధ్యాత్మిక భావనను పెంచుతుందని భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అభిప్రాయపడ్డారు.

ఈ మేరకు పర్యాటక శాఖ సన్నాహాలు చేస్తుందని వెల్లడించారు. భక్తుల కోరిక మేరకు 18 మంది సమూహంతో పర్యాటక శాఖను సంప్రదిస్తే ప్రయాణం ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పెద్దలకు రూ.1000, 3-10 ఏళ్లలోపు చిన్నారులకు రూ.800 టూర్ ఛార్జీగా నిర్ణయించామన్నారు. ప్రకృతి రమణీయత, అధ్యాత్మిక కలయికతో కూడిన టూర్ ప్యాకేజీని యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు. అధ్యాత్మిక భావంతో పాటు సాంస్కృతిక, చారిత్రాత్మిక ప్రదేశాలకు మరింత వెలుగులు అద్దడమే టూర్ ప్యాకేజీ ముఖ్యోద్దేశమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

# పేద ప్రజల హృదయాలలో ఎప్పటికీ చిరంజీవి కామ్రేడ్ వంక సత్యనారాయణ

– డా. అడ్డాల



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక రమణయ్యపేట వద్ద ఉన్న అడబాల ట్రస్ట్ ఆవరణలో డా. అడ్డాల సత్యనారాయణ, జానకిరమ దంపతులచే వృద్ధులకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కామ్రేడ్ చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ఈ రోజు మాజీ శాసనసభ్యులు, ప్రముఖ స్వతంత్ర సమర యోధులు,గొప్ప కమ్యూనిష్టు నాయకులు అయినటువంటి వంక సత్యనారాయణ ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వారి పెద్ద మనుమడు, మనుమరాలు అయినటువంటి ప్రముఖ దంత వైద్యులు డా. అడ్డాల సత్యనారాయణ, జానకిరమ దంపతులు ఇక్కడ ఉన్న వృద్ధులకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారని అన్నారు. కమ్యూనిష్టు పార్టీలో కామ్రెడ్ వంకా సత్యనారాయణ 1946 లో ముంబైలో జరిగిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య మహాసభలో పాల్గొన్న నాటి నుండి 2018 అక్టోబర్ 25వ తేదీన తుదిశ్వాస విడిచేవరకు ఆయన త్రికరణసుద్దిగా కమ్యునిష్టు యోధుడుగానే ఉన్నారు. ఆయన పెనుగొండ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి మూడు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించి, ప్రజా సమస్యలపైన అలుపెరుగని పోరాటం సాగించి "అసెంబ్లీ టైగర్ " అనే బిరుదు పొందారని, ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరంజీవిగా నిలిచిన మహా నాయకుడు కామ్రెడ్ వంక సత్యనారాయణ అని అన్నారు. డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ చిన్ననాటి నుండి తాతయ్య యొక్క ప్రభావం మా మీద చాలా ఉండేదని, ఎవరైనా కష్టంలో ఉంటే మా చేతనంత సహాయం చేయటం ఆయన వలనే అలవడిందని, ఆయన పెద్ద మనుమడిగా ఆయన ఆశయాలను నెరవేర్చడానికి నిరంతరం పాటుపడతానని తెలిపారు. ఆయన ఎప్పటికీ మా హృదయాలలో గొప్ప స్ఫూర్తిగా నిలిచే ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జానకిరమ, అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్, రెడ్నం రాజ, ఓం నమశ్శివాయ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పూరీజగన్నాథ్, రామ్ పోతినేని పవర్ఫుల్ మాస్ ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్'


– ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు, మీ జీతెలుగులో..




**రాజమహేంద్రవరం,మేజర్ న్యూస్ :** తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలో ఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది.ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్‌ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందిస్తోంది. అద్భుతమైన కథ, కథనంతోపాటు పూరీ జగన్నాథ్ డైరెక్షన్, రామ్ నటవిశ్వరూపంతో బాక్సాఫీస్ వద్ద మంచి మార్కులు కొట్టేసిన డబుల్‌ఇస్మార్ట్,ఈ ఆదివారం(అక్టోబర్ 27న) సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో మాత్రమే.. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించినఈ సినిమా కథ అంతర్జాతీయ మాఫియా డాన్ బిగ్ బుల్ (సంజయ్ దత్) చుట్టూ తిరుగుతుంది. అతను గ్లియోమా నిర్ధారణ అయినతర్వాత మరణం నుండి తప్పించుకోవడానికి ఆరాటపడతాడు. అతని జ్ఞాపకశక్తిని మరొకరి మెదడుకుబదిలీ చేయడం వల్ల అతను అమరుడవుతాడని ఒక శాస్త్రవేత్త సూచించడంతో అందుకు సరిపోయేవ్యక్తికోసం అన్వేషణ మొదలవుతుంది. ఆ అన్వేషణలో హైదరాబాద్ లోని శంకర్ (రామ్ పోతినేని)సరైన వ్యక్తిగా గుర్తించడంతో బిగ్బుల్ మెమరీ ట్రాన్స్ ఫర్ జరుగుతుంది, ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయం తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే డబుల్ ఇస్మార్ట్ సినమాచూడాల్సిందే. రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన ఈ సినిమాలో సంజయ్ దత్, గెటప్ శ్రీను, అలీ, షాయాజీ షిండే, ఝాన్సీ వంటినటులు కీలక పాత్రలు పోషించారు. యాక్షన్, కామెడీ, థ్రిల్లింగ్ కాన్సెప్ట్తో రూపొందిన ఈ మాస్‌ఎంటర్టైనర్ని జీ తెలుగు వేదికగా ఈ ఆదివారం మీరూ తప్పకుండా చూడండి.

## పిఠాపురం గురుకులంలో సైన్స్ ఎగ్జిబిషన్

– ఫ్యూచర్ –2024 సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ షన్మోహన్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు సంబంధించి శుక్రవారం పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఫ్యూచర్ – 2024 సైన్స్ స్కేర్, ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. అంబేద్కర్ గురుకుల పాఠశాల అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.తొలుత పాఠశాల ఆవరణంలో ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థి దశ నుండే సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గురుకుల పాఠశాల సమన్వయ అధికారి జి.వెంకటరావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసు వినిల్ కుమార్, పిఠాపురం అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బీవీ.వెంకట త్రివేణి, ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# యువతే దేశాభివృద్ధికి కీలకం





– రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావు
– పూర్ణకుంభంతో వెంకటేశ్వరరావుకు స్వాగతం పలికిన చేయూత వ్యవస్థాపకులు రవికుమార్

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రపంచంలోనే భారతదేశం అగ్రస్థానంలో నిలబెట్టేది యువతేనని యువ సంపదను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు అవ్వాల్సిందిగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు (విజయనగరం) పిలుపిచ్చారు. రోటరీ చేయూతభవన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయన వెంట రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ధనసాగర్ ప్రసాద్, రోటరీ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షులు ఎస్.శ్రీకాంత్, కార్యదర్శి డి.శ్రీకాంత్, చేయూత జిల్లా మహిళా అధ్యక్షురాలు సురభి శారదతో పాటు పలువురున్నారు. ఈ సందర్భంగా పూర్ణకుంభంతో రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావుకు అపూర్వ స్వాగతాన్ని చేయూత వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ మొండి రవికుమార్ పలికారు. అనంతరం చేయూత సంస్థ నిర్వహిస్తున్న అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలను డాక్టర్ రవి వివరించారు.

ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువతే భారత దేశ సంపదగా ఆయన ప్రస్తావిస్తూ యువతను సరియైన మార్గములో తీర్చుదిద్దడానికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేటి విద్యార్థులు క్రమశిక్షణతో పాటు అవకాశాలను సద్వినియోగం చేసుకునే విధంగా ఆలోచన సరళి చేయడానికి అవసరమైన శిక్షణా తరగతులను నిర్వహించాల్సిందిగా సూచించారు. చేయూత వంటి సంస్థలు ప్రతి జిల్లాలోనూ ఉండాల్సిన అవసరం ఉందని దీని ద్వారా విద్యా, వైద్య, ఆరోగ్య, అన్ని రంగాలలోనూ సేవలు నిర్వహిస్తే ఉత్తమమైన సమాజ ఆవిర్భావానికి దోహదపడుతుందన్నారు. అన్ని జిల్లాలలోనూ పలు సేవా సంస్థలు రోటరీతో కలిసి అనేక కార్యక్రమాలను ప్రతినిత్యం చేపడుతోందని దాని ఫలితంగా నేడు యువతీ యువకులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అంతర్జాతీయ రోటరీ కూడా యువతను సేవామార్గం ద్వారా సమాజానికి ఉత్తమమైన పౌరులుగా అందించేందుకు ఇంటరాక్ట్ మరియు రోటరాక్టు సంస్థల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని ప్రస్తావించారు. రోటరీ డిస్ట్రిక్ట్‌లో వున్న రోటరీ క్లబ్బులు యువతకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ వివిధ పోటీలతోపాటు వారిలో ఆరోగ్యం మరియు పోటీతత్వం పెంచే విధంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని వివరించారు.చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రవి కుమార్ మాట్లాడుతూ చేయూత ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.8 కోట్లను వెచ్చించి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా యువతలో చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే కార్యక్రమాలను చేపడుతున్నామని, అదేవిధంగా తమ సంస్థలో విద్య నభ్యస్తున్న 50 మంది పిల్లలకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు వారికి ఉద్యోగ పట్టా అందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టామని, ఆరోగ్యపరంగా అనేక మందికి ఆర్థిక సహాయంతో వైద్య సేవలను అందించడం జరిగిందని చెప్పారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలుపుకుంటూ క్లబ్బు గౌరవాన్ని ప్రతిష్టను పెంపొందించే విధంగా తమ సం::స్థ నిరంతరం పనిచేస్తుందన్నారు. తమ చేయూత కమిటీలో సుమారు 2200 మంది సభ్యులు ఉన్నారని అందులో విద్యావంతులు, వైద్యులు, సామాజిక సేవ కార్యకర్తలు,ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, సీనియర్ సిటిజన్స్ తో పాటు కేంద్ర ప్రభుత్వ అధికారులు కూడా ఉన్నారని డాక్టర్ రవి కుమార్ వివరించారు, రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావును వేదమంత్రాలనడుమ ఘనంగా సత్కరించి అపూర్వ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# జెఎన్టీయుకెలో ఇండస్ట్రీ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్





కాకినాడ,మేజర్‌న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో శుక్రవారం ఉదయం అలూమ్ని ఆడిటోరియం నందు జెఎన్‌టియుకె ఐఐఐపి&టి డైరెక్టరేట్ మరియు అమెరికన్ టెలీఫోన్ & టెలీగ్రాఫ్ (ఏటి&టి) కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో యుసిఇకెలోని బీటెక్ సిఎస్ఈ, ఈసిఈ తృతీయ సంవత్సరం, ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ఇండస్ట్రీ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఐఐఐపి&టి డైరెక్టర్ ప్రొ. బి.టి.కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏటి&టి కంపెనీ ఆసియా–పసిఫిక్ రీజనల్ హెడ్ పద్మజా శ్రీరామ్, సీనియర్ స్పెషలిస్ట్ ఎస్.గోపీనాథ్ రీసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించారు. యుసిఇకె ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.కరుణ అరవ కార్యక్రమానికి కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

ఈ సందర్భంగా ఏటి&టి ఆసియా–పసిఫిక్ రీజనల్ హెడ్ పద్మజా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ టెలీఫోన్ సేవలకు అమెరికాలోని ఏటి&టి కంపెనీ పేరుగాంచడంతో పాటు ప్రపంచంలో మూడవ అతిపెద్ద టెలీకమ్యూనికేషన్స్ కంపెనీ అని తెలిపారు. మనం ఉన్నతస్థాయికి ఎదిగేందుకు రాజీలేకుండా సరైన క్రమపద్ధతిలో పనిచేయడంతో పాటు ఎటువంటి పనిలోనైనా చిన్న మార్పుతో ప్రారంభిస్తే అది ప్రపంచాన్ని ప్రభావితం చేయగలదన్నారు. పెద్దగా ఆలోచించడంతో పాటు ఏ పనినైనా సమానంగా భావించి చేసినపుడే విజేతగా నిలుస్తామన్నారు. విద్యార్థులు ముఖ్యంగా తమ నైపుణ్యాలతో వీలైనంతమందిని కలుపుకునేందుకు (కనెక్టింగ్) అవకాశాలను సృష్టించుకోవాలన్నారు. ప్రపంచంలోనే ఏటి&టి కంపెనీ ఉత్తమ కనెక్టివిటీ ప్రొవైడర్‌గా నిలుస్తుందన్నారు.ఏటి&టి సీనియర్ స్పెషలిస్ట్ ఎస్.గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, భావవ్యక్తీకరణ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుత సాంకేతిక రంగంలో ప్రపంచంలో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు.అనంతరం ఏటి&టి కంపెనీ ఆసియా–పసిఫిక్ రీజనల్ హెడ్ పద్మజా శ్రీరామ్, సీనియర్ స్పెషలిస్ట్ ఎస్.గోపీనాథ్ లు విసి ఛాంబర్‌లో ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలిసి ఏటి&టి కంపెనీ కార్యకలాపాలను, చేపడుతున్న ప్రాజెక్ట్‌లను వివరించారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాథ్, ఐఐఐపి&టి డైరెక్టర్ ప్రొ. బి.టి.కృష్ణ, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్.మోహన్‌రావు, సిఎస్ఈ విభాగాధిపతి ప్రొ. ఎన్.రామకృష్ణయ్య, ఈసిఈ విభాగాధిపతి డా. బి.లీలాకుమారి, యుసిఇకె ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ అధికారి డా. కరుణ అరవ, సిఎస్ఈ, ఈసిఈ విభాగాల విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి

– అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా సక్రమమైన పరిష్కారాలు అందించాలి
– నగరపాలక అధికారులతో కమిషనర్ భావన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రజా విజ్ఞాపనల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. శుక్రవారం శారదమ్మ గుడి వద్ద గల నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంపై కమిషనర్ సమీక్షించారు. నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో కమిషనర్ భావన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం అందిన ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అర్జీదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా సక్రమమైన పరిష్కారాలు అందించేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. గత 15 రోజులలో వచ్చిన దరఖాస్తులపై ప్రతివారం సమీక్షిస్తామన్నారు. ఈ సమీక్షలో ఇప్పటి వరకు పరిష్కారమైన దరఖాస్తులు, పరిష్కరించినవి సంతృప్తికరంగా ఉన్నయా..? లేవా? ఇంకా ఎన్ని అర్జీలను పరిష్కరించాలి? పరిష్కరించక పోవడానికి గల కారణాలు? అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులను కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క ఫిర్యాదు గురించి సంబంధిత అధికారులు పూర్తి అవగాహనతో సమావేశానికి హాజరుకావాలని కమిషనర్ స్పష్టం చేశారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలను కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## జనరిక్ మందులను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

– అక్టోబర్ 30న కాకినాడ కలెక్టరేట్ వద్ద జరుగు నిరసనకు కార్మిక సంఘాల మద్దతు
– ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ట్రేడ్ యూనియన్స్ (ఫీచీఖ) ఆధ్వర్యంలో కరపత్రావిష్కరణ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** జనరిక్ మందుల షాపులను ప్రజలకు చేరువ చేయాలని, డాక్టర్లు జనరిక్ పేరుతో చీటి రాయాలన్న క్లాస్ 1.5 ఆఫ్ ఇండియన్ మెడికల్ కౌన్సిల్ రెగ్యులేషన్ 2002 చట్టం అమలు చేసి బ్రాండ్ పేరుతో కార్పొరేట్ ఫార్మసిటికల్ కంపెనీల దోపిడీని అరికట్టాలని, అక్టోబర్ 30న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలకు =జూ× పార్టీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే, ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ట్రేడ్ యూనియన్స్ ఫీచీఖ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జయప్రదం చేయాలని కరపత్ర ఆవిష్కరణ చేశారు,

ఈ సందర్భంగా పోర్ట్ పరిశ్రమ కార్మికులు నిరసన ప్రదర్శనలో పాల్గొని ప్రజా సమస్యలపై కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫీచీఖ జిల్లా నాయకులు సూరిబాబు, శివాజీ, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన




పెద్దాపురం,మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపం డితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేద పండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది గౌరి, వెంకటరమణ, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు




**- తాసిల్దార్ డి.అచ్యుతకుమారి**

**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు గ్రామ పంచాయితీ నందు అక్టోబర్ 25 వ తేదీ శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ డి అచ్యుత్ కుమారీ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమమునకు గ్రామసర్పంచ్ బావన మధు పూర్ణ చందు అధ్యక్షత వహించగా మండల తహాశీల్దార్ డి అచ్యుతకుమారి, డిప్యూటీ తహాశీల్దార్ సన్ని బాబు, మండల సర్వేయరు జి.శేషుకుమారి, పంచాయితీ కార్యదర్శి టీ.రాంబాబు,గ్రామరెవెన్యూ అధికారులు కొమ్మిశెట్టి రాజశేఖర్, ఎం నాగేశ్వరరావు మరియు గ్రామసర్వేయర్లు పాల్గొని గ్రామప్రజలు నుండి వినతులు స్వీకరించగ అందు భూసర్వే నిమిత్తం 25 ధరఖాస్తులు మరియు ఆర్ఓఆర్ కొరకు 1 ధరఖాస్తులు వచ్చిఉన్నవి.

## కొవ్వూరు మండలం వాడపల్లి, ఔరాంగబాద్ ఇసుక రీచ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి రామానాయుడు

**- బోట్స్ మ్యాన్ సొసైటి సభ్యులతో సమస్యలపై చర్చించిన మంత్రి రామానాయుడు**

**- చెల్లింపుల విషయంలో త్వరిత గతిన చెల్లింపులు కోసం ఆదేశాలు జారీ చెయ్యడం జరుగుతుంది**

**- నదీ ప్రవాహం తగ్గిన వెంటనే ఓపెన్ రిచ్‌లు అందుబాటులోకి తీసుకుని రావడం జరుగుతుంది**

**- జిల్లా ఇంఛార్జి మంత్రి రామానాయుడు**



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే ఇసుకను ఉచితంగా ప్రజలకు అందించే విధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తూర్పు గోదావరి జిల్లా ఇంఛార్జి మంత్రి, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

శుక్రవారం సాయంత్రం జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, శాసనసభ్యులు మైనింగ్, ఇరిగేషన్ అధికారులతో కలిసి వాడపల్లి , ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులను క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, బోట్స్ మ్యాన్ సొసైటి సభ్యులతో ముఖాముఖి సంభాషించి, వారి ఇబ్బందులు తెలుసుకుని, అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఇసుకను ఉచితంగా ప్రజలకు మరింత సరళీకృత విధానంలో వినియోగదారులకి అందించే విధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగా నేడు క్షేత్ర స్థాయిలో ఇసుక ర్యాంపులు పరిశీలన నిమిత్తం రావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇష్టానుసారం ఇసుక దోపిడీ చేసిందన్నారు. నేషనల్ ట్రిబ్యునల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అభ్యంతరాలు ఉండటం వలన కొన్ని ఇసుక ర్యాంపులను ప్రారంభించ లేకపోయామని, దీనితో ప్రారంభించిన ఇసుక ర్యాంపులు పై నే ఒత్తిడి ఉండటం క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన సందర్భంలో గమనించడం జరిగిందని పేర్కొన్నారు. బోట్స్ మ్యాన్ సొసైటి సభ్యులతో తీసుకువచ్చే ఇసుకను ఆన్లైన్ , ఆఫ్ లైన్ విధానంలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా, సమస్యను పరిష్కరించి వినియోగ దారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇంకా గోదావరిలో అటు కృష్ణానదిలో వరద ప్రభావం ఉందని దీనిని అధిగమించి వినియోగదారులకు పూర్తిస్థాయిలో ఇసుకను అందజేస్తామన్నారు. ఓపెన్ రీచ్‌లు కూడా ప్రారంభమైతే వినియోగ దారుల డిమాండ్ తగ్గట్టుగా అందరికీ అందుబాటులో ఇసుక ఉంటుందనే విషయాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. వినియోగ దారులకు డిమాండ్‌కు అనుసరించి ఇసుకను అందుబాటులో ఉండేలా రెవెన్యూ , ఇరిగేషన్, మైన్స్ అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆదేశించడం జరిగింద న్నారు. గత ప్రభుత్వం 30 నుంచి 40 వేల కోట్లు రూపాయలను ఇసుకపై అక్రమ ఆదాయాన్ని సమకూర్చుకుందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పథకం ద్వారా ప్రజలకు ఉచితంగానే ఇసుకను అందించాలని ప్రభుత్వ నిర్ణయానికి అందరూ సహకరిం చాలని మంత్రి కోరారు. వినియోగదారులు వారి అవసరాలకు అనుగుణంగా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల పై ఇసుకను ఉచితంగా తీసుకొని వెళ్లవచ్చు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే స్పష్టం చేశారని, ఈ విధానానికి అణుగుణంగా క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు అధికారులు పని చెయ్యాల్సి ఉంటుందనీ, ఆమేరకు చర్యలు తీసుకోవాలనీ ఆదేశించారు. వరద నీరు తగ్గిన తర్వాత మరో వారం, పది రోజుల్లో ఓపెన్ రిచ్‌లను పూర్తి స్థాయిలో ఇసుకను అందుబాటులోకి తీసుకుని రావడం జరుగుతుందన్నారు. సముద్ర తీర ప్రాంతంలో 50 కిలోమీటర్ల దూరంలో ఇసుకను త్రవ్వేందుకు అనుమతులు లేదని ఎన్జీటీ వారి ఉత్తర్వులు మేరకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు అవసరమైన ఇసుక కొవ్వూరు రాజమండ్రి నుంచి వినియోగదారులకు అందుబాటులో అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇసుక రీచ్ ను పూర్తిస్థాయిలో ఎన్ని యోగంలోకి తెచ్చే విధంగా ఇలా కలెక్టర్ వారికి, మైన్స్ డిపార్ట్మెంట్‌కు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రిగా ప్రజలకు పూర్తిస్థాయిలో ఉచిత ఇసుకను ఆన్లైన్ ఆఫ్ లైన్ విధానంలో అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆ దిశగా ప్రతిరోజు ఇసుక ర్యాంపులను పరిశీలించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో త్రవ్విన ఇసుకకు సంబంధించి పెండింగ్ లో ఉన్న బిల్లులను ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మేరకు జిల్లా కలెక్టర్ కు, అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. బోట్స్ మ్యాన్ సొసైటి లకు అక్టోబర్ 13 నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లింపులు జరుపుతామని ఈ మేరకు అధికారులకి స్పష్టంగా ఆదేశించడం జరిగిందన్నారు. ఇసుకను ఆన్లైన్లో బుక్ చేసుకునే వారు రాకపోతే ఆఫ్ లైన్‌లో వచ్చిన వారికి ఇసుకను అందించే అధికారులు సహకరించాలన్నారు. వాడపల్లి ఇసుక ర్యాంపు ద్వారా ప్రతిరోజు 5 వేల టన్నులు బయటికి వెళ్లే పరిస్థితులు ఉన్నాయన్నారు.

ఈ ప్రక్రియను కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. దీని వలన డిమాండ్ తగ్గి సప్లై పెరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా అన్ని రీచ్ లలో ఇసుక లభ్యత ఉంటుందో అంతా మార్కెట్ లోనికి పంపించడం వలన ఇసుక డిమాండ్ తగ్గి సప్లై పెరుగుతుందని తద్వారా బ్లాక్ మార్ట్ మార్కెటింగ్ కూడా నిరోధించవచ్చునని మంత్రి పేర్కొన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు వెంట శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు, బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, ఆర్డిఓ లో ఆర్ కృష్ణ నాయక్, రాణి సుస్మిత, ఏడి మైన్స్ డి ఫణి భూషణ్ రెడ్డి, పోలవరం సిఇ నరసింహామూర్తి, ఇరిగేషన్ ఎస్ ఇ.. జి. శ్రీనివాస రావు, కొవ్వూరు డిఎస్పీ దేవ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఫ్యూచర్ -2024 సైన్స్ స్కేర్, ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు సంబంధించి శుక్రవారం పిఠాపురం జగ్గయ్యపేట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఫ్యూచర్ -2024 సైన్స్ స్కేర్, ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. అంబేద్కర్ గురుకుల పాఠశాల అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలుత పాఠశాల ఆవరణంలో ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గురుకుల పాఠశాల సమన్వయ అధికారి జి.వెంకటరావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసు వినిల్ కుమార్, పిఠాపురం అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బీవీ.వెంకట త్రివేణి, ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### నివాస ప్రాంతాల మధ్యలోమద్యం దుకాణం తొలగించాలి



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** నీలాద్రి రావు పేట గ్రామంలో రామభద్రయ్య చెరువు ప్రక్కన గల కాలి స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు జరుగుచున్నవి ఆస్థలం ఊరికి దగ్గరగా ఇళ్ళకు దగ్గరగా మరియు చర్చి, సచివాలయం, హెల్త్ సెంటర్ దగ్గర్లో ఏర్పాటు చేయడం తగదని నీలాద్రిరావు పేట గ్రామానికి చెందిన గ్రామస్తులందరూ కలిపి ఎం.ఎల్.ఏ., తశీల్దార్, ఎం.పి.డి.ఒ ఎక్సైజ్ సీఐ, గండేపల్లి ఎస్.ఐలకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చర్చికి కార్యాలయానికి వెళ్లే దారిలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం వల్ల ఆ దారిని వెళ్లే మహిళలు విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుంది . చుట్టు ప్రక్కన ఇంట్లో ఉండే ఆడవాళ్ళకి మరియు విద్యార్థినులకు ఆదారి నుంచి వెళ్ళి వారికి ఇచ్చింది కలుగుతుంది. సాయంత్రం కాలేజీలు నుంచి వచ్చే విద్యార్థులకు అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే పలు ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని గ్రామస్తులు విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. అదే విధంగా ఈరోడ్డును ఎన్‌హెచ్-16 వారు రెడ్ జోన్‌గా ప్రకటించడం జరిగింది. కావున ఈ సమస్యను ఉన్న స్థాయి అధికారులు పరిశీలించి మద్యం దుకాణాన్ని వేరేచోటకి మార్చవలసిందిగా కోరుతున్నారు.

## కింద్రలో టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం

**- ప్రారంభించునున్న ఎమ్మెల్యే శిరీష దేవి భాస్కర్**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్:** రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి భాస్కర్‌తో శనివారం కింద్ర గ్రామంలో టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శిలు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన కేశవ్ తెలిపారు. ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభించనున్న తరుణంలో శనివారం మండలం లోనికింద్ర పంచాయతీకి చెందినకింద్ర గ్రామంలోఉదయం గం 11కు సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించడానికి మన నియోజ కవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్ ముఖ్య అతిధిగా విచ్చేస్తు న్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మండల తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు,యూనిట్,బూత్ ఇంఛార్జి లు,ప్రజా ప్రతి నిధులు,వివిధ హోదాల్లో ఉన్న పార్టీ కేడర్,మహిళా నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా పెద్దిరాజు, కేశవ్ విజ్ఞప్తి చేశారు.

## కిడ్నాప్‌కు యత్నించిన వ్యక్తులపై కేసు నమోదు

**కొత్తపేట, మేజర్ న్యూస్ :** కిడ్నాప్‌కి యత్నించిన తొమ్మిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన దంగేటి వెంకటరత్నం అనే మహిళ ఆమె కుమార్తెతో కలిసి కుమారుని ద్విచక్ర వాహనంపై అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలో ఆదివారం బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో స్థానిక సాయిబాబా గుడి సమీపంలో వచ్చేసరికి అదే కోరుమిల్లి గ్రామానికి చెందిన పోలిశెట్టి కృష్ణ అనే వ్యక్తి అతని స్నేహితులతో కలిసి వెంకటరత్నం కుమార్తెను ప్రేమ కారణం చూపి కిడ్నాప్‌కు ప్రయత్నించారు. సదరు విషయాన్ని వెంకటరత్నం వాళ్ళ పెద్దలకు తెలియజేయడంతో వాళ్ళు ఇచ్చిన సలహా మేరకు కొత్తపేట పోలీసు లకు ఫిర్యాదు చేసింది.ఈ సంఘటనపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పట్టణ మహిళా సమాఖ్య మెరుగుకు కృషి చేయాలి

**- కమీషనర్ పద్మావతి**



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** శుక్రవారం పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో మెప్మా సిఎంఎం భ్రమరాంబ ఆధ్వర్యంలో మెప్మా కార్యాలయం నందు పెద్దాపురం పట్టణ మహిళా సమాఖ్య 12వ వార్షివ మహాజన సభ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి పాల్గొని మాట్లాడుతూ పెద్దాపురం పట్టణ సమాఖ్య మహాసభ నిర్వాహణ తీరు అభినందనీయమని, ఎస్‌హచ్‌జి గ్రూప్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయని, అదే విధంగా ఓఎన్‌డిసి ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ మీద ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని, ఎస్‌హెచ్‌జి మెంబర్స్ లోన్లు తీసుకుని వ్యాపారం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కమీషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఐబి మోహన్‌కుమార్, మెప్మా సిఓలు శ్రీదేవి, నర్గీస్, పిఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్ ఓబిలు, ఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

### కోచింగ్ తీసుకున్న ప్రతి ఒక్కరు ఉపాధ్యాయులు కావాలి జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్

**- జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభం**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక గోకవరం రోడ్డులో గల కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 11: 19 నిమిషాలకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ను ప్రారంభించారు. ముందుగా సరస్వతి దేవికి, సర్వేపల్లి రాధాకృష్ణకు పూలమాలలువేసి జ్యోతి ప్రజ్వలన చేసి క్లాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని ముఖ్యంగా క్వాలిఫై లోనే 80% శాతం అవడం చాలా ఆనందంగా ఉందని ఇదేవిధంగా ఉపాధ్యాయ ఉద్యోగాల్లో కూడా అత్యధిక శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని ఇది ప్రభు త్వం ద్వారా ఇచ్చే కోచింగ్ కాదని మా కార్యకర్తల సహకారంతో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నామని మీరు ఉద్యోగాలు సాధించి నీ తల్లిదండ్రులని జాగ్రత్తగా చూసుకోవాలని అదే మాకు మీరు కృతజ్ఞత ని అన్నారు.ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చ య్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తోట రవి, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, జీను మణిబాబు, జనపరెడ్డి బాబు, బుర్రి సత్తిబాబు, నీలం శ్రీను, అనుకూల శ్రీకాంత్, ఘూజింగం సత్తిబాబు, దాసరి సీతారామకృష్ణ, బత్తుల సత్తిబాబు, తోలేటి సూర్యనారాయణ, గద్దె మారుతి, క్లస్టర్ ఇన్చార్జులు, పాఠం శెట్టి మురళీకృష్ణ, బొల్లం రెడ్డి రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, యర్రంశెట్టి బాబ్జి, సర్పంచులు, అడబాల ఆంజనేయులు, సర్వసిద్ధి లక్ష్మణరావు, కమ్మిల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ నీలం చక్రధర్, ఎమ్మెస్ మూర్తి, ఉదయ భాస్కర్ చౌదరి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఆడ శిశువుల పట్ల వివక్షత జరిగే ప్రాంతాలలో భ్రూణ హత్యలను నివారించడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డెకాయ్ ఆపరేషన్ చెయ్యాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో వివేకానంద మీటింగ్ హాల్ నందు వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, మరియు డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ జిల్లా స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించు కోవడం చట్ట రీత్యా నేరమని, జిల్లా స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన 153 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఏప్రిల్ నెల నుండి అక్టోబర్ నెల వరకు 27 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 220 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తగా గర్భిణీ స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఒక న్యూ రిజిస్ట్రేషన్, రెండు రెన్యువల్, 7 యాడింగ్ అఫ్ మెషిన్, యాడింగ్ అఫ్ ఎంప్లాయ్, నూతన ఎ.ఆర్.టి. లెవెల్ -2 (ఐ.వి.ఎఫ్ కేంద్రం) కు సంబంధిచి ఈ కమిటి మీటింగ్‌లో ఆమోదం తెలిపినారు.

మూడోవ అదనపు జిల్లా జడ్జి పి.కమలా దేవి మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాల సమాచారము లేక నమోదు కానీ స్కానింగ్ కేంద్రాలు మరియు అర్హత లేని వైద్యులు వివరములు ఈ దిగువ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 3365కు తెలియ చేయవలసిందిగా కోరారు.అంతర్జాతీయబాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాటశాల విద్యార్థిని విద్యార్థులకు పి.సి.పి.ఎన్.డి.టి. చట్టంపై అవగాహనా నిమిత్తం వ్యాసరచన, వక్తృత్వ మరియు పెయింట్ పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ పోటీలలో గెలుపొందిన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థినీవిద్యార్థులకు నగదు, మొమేంటో మరియు ప్రశంస పత్రాలు మొదటి బహుమతి రూ.5,000, రెండవ బహుమతి రూ.3,000, మూడోవ బహుమతి రూ.2,000 చొప్పున మొత్తం రూ.30,000 నగదు ఇవ్వడం జరిగినది.

ఈ సమావేశంలో ఇంచార్గ్ డి.ఎం.హెచ్.ఒ డా. ఆర్.రమేష్, డీఐవో డా. కె.వి. సుబ్బరాజు, డి.సి.హెచ్.ఎస్., డా. ఎస్. స్వప్న, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఒ, డా. పి.సరిత, జి.జి.హెచ్. ఆర్.ఎం.ఒ. డా. కె.అనిత, వుమెన్ పోలీసు స్టేషన్ డి.ఎస్.పి. ఆర్.రామచంద్ర రావు, డి.డి.ఐ. & పి.ఆర్, డి. నాగార్జున, జి.జి.హెచ్. నుండి వచ్చిన హెచ్.ఒ.డి.లు, రేడియాలజీ, పిడియాట్రిక్, గైనిక్, పేథాలజీ డిపార్టుమెంటు వారు, డా ఎస్.నందిశ్వరి, ఎన్.జి.ఒ. లు ఎస్.అప్పల నాయుడు, పి.చక్రవర్తి, ఎం.డి.సఫురా, ఐ.సి.డి.ఎస్. ప్రవీణ మరియు డెమో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.పైడిపాల గిరిజనులు ఎమ్మార్వోకి వినతి

**- మా భూములకు పట్టాలు ఇవ్వండి**



**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** యస్.పైడిపాల గ్రామంలో నైనాలమ్మ తల్లి (చింత) గొర్రబోతలుమెట్ట సమీపంలో సర్వే నెం:1 లో పూర్వీకుల సుమారు 15-20 సంవత్సరాల నుండి గిరిజనులు కొండ పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూములకు పట్టాలు ఇప్పించాలంటూ శుక్రవారం డిప్యూటీ తాసిల్దార్ నరేష్ కు వినతిపత్రం అందించారు.పలుమార్లు అధికారులుకు విన్నవించుకున్న రీ సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారని గిరిజన పెద్దలు ఈగల సత్తిబాబు,వరహాలు పలువురు ఆరోపించారు.

రీ సర్వేలు జరుగుతాయిని అప్పడు పట్టాలు ఇస్తామని గత అధికారులు చెప్పియున్నారు.రెవిన్యూ భూమా,ఫారెస్టు భూమా అని నిర్ధారణ చేసి చెబుతామని నమ్మబలికి ఉన్నారు.నేటి వరకు అధికారులు ఎప్పుడు వస్తారని గిరిజనులు ఎదురు చూస్తున్నమ్మన్నారు.గిరిజనులకు చెందవలసిన భూములలో వైసీపీ నాయకులు అండదండలతో యస్. పైడిపాల గ్రామానికి చెందిన గొల్లు శ్రీనివాస్ (శ్రీనుబుజ్జి ),రాళ్లపల్లి శివ,గొల్లు నాగబాబు,చింతల శ్రీను,గొల్లు సత్తిబాబు మరి కొంతమంది నాన్-ట్రైబులకు చెందిన వ్యక్తులు అక్రమంగా అక్రమించారని తాసిల్దార్‌కి తెలిపారు.జేసీపీ మెషిన్నుతో పని చేయించి జమాయిల్ మొక్కలు వేయగా మాకు తెలియవచ్చినది.

ఈ విషయం.తెలియగా జిల్లా కలక్టరుకు పిర్యాదు చేయగా ఇది ఫారెస్ట్ భూమా?రెవిన్యూ భూమి అని నిర్ధారణ చేసి, రెవిన్యూ భూమి అయితే పట్టాలు ఇస్తామని చెప్పియున్నారన్నారు కలక్టరు ఆదేశాల మేరకు రెవెన్యూ,ఫారిస్టు అధికారులు 23/10/24 తేదిన ఈయొక్క భూమిలను సర్వే చేసి ఇది రెన్యూ భూమిగా నిర్ధారణ చేసినారు.ఆక్రమంగా భూమిలో ప్రవేశించిన వారిని తొలగించి గిరిజనలైన మాకు పట్టాలు ఇప్పించి మా కుటుంబాలను ఆదుకోవాల్సిందిగా కోరియున్నారు. పై విషయాలను పరిశీలించి ఆక్రమర్జులైన అగ్ర కులస్తులను భూమి నుండి వైదొలిగించాలని డిమాండ్ చేశారు.రాజకీయ -డబ్బు పలుకుబడితో పట్టాలు చేయించుకోవాడానికి అధికారులను త్రప్పుద్రోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి పూర్తి విచారణ జరిపి మా గిరిజనులు భూములు మాకు అప్పగించాలని గిరిజనులు కోరారు

# మెప్మా అర్బన్ మార్కెట్ ప్రదర్శన ఏర్పాటు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, మరియు అమ్మకాలకు సంబంధించిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను కాకినాడ నగరంలో శుక్రవారం ఉదయం ప్రారంభించారు. నగరంలోని రిజర్వ్ పోలీసు లైన్ సమీపంలోని ఉన్న ఓల్డ్ మీ సేవా కేంద్రంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. నగరంలోని పలు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పలు ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు. ఈ ప్రదర్శనను మెప్మా పీడీ ప్రియంవద ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, మెప్మా సీఓలు,ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో పలు ఉత్పత్తులను ఉంచారు. నగర ప్రజలు ఈ అర్బన్ మార్కెట్‌ను సందర్శించి మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.

# ఏలేశ్వరంలో వసతి గృహాలు సందర్శించిన సివిల్ జడ్జి బులెమ్మ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** పట్టణంలో బీసీ బాలికల, కళాశాల వసతి గృహం, బాలుర వసతి గృహాలను ప్రత్తిపాడు కోర్ట్ ఇంఛార్జి సివిల్ జడ్జి బులెమ్మ శుక్రవారం సందర్శించారు. ఆమెతో పాటు ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర నాయకులు బుగతా శివ ప్రత్తిపాడు బార్ సెక్రటరీ బొంగులూరి మధుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బులెమ్మ మాట్లాడుతూ త్రాగునీరు, వంట శాల, గదులు సందర్శించడం జరిగింది. మెనూ ప్రకారం భోజనం, విద్యార్థులకు సకల సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్స్‌కి ఆదేశించారు. రికార్డులు, బియ్యం, హాజరు పట్టీలు పరిశీలించారు. విద్యార్థులను విద్య, వసతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

# ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చెయ్యాలి

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా ఎటువంటి ఫిర్యాదులు అవకతవకలకు తావు లేకుండా నిర్వహించాలని ఆబ్కారి, భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా జిల్లాస్థాయి ఇసుక కమిటీలకు సూచించారు. శుక్రవారం రాత్రి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుండి వివిధ జిల్లాలకు చెందిన జిల్లా కమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సవరించిన ఉచిత ఇసుక పాలసీ 2024 పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 8న ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి వచ్చిందని అప్పటినుండి పలుద పాలుగా క్యాబినెట్ సబ్ కమిటీ పలు సవరణలు చేయడం జరిగిందని తెలిపారు. సవరించిన పాలసీ ప్రకారం సీనరేజ్, డిఎంఎఫ్ మెరిట్ నిధులను ఇకపై చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. గ్రామపంచాయతీల పరిధిలో ఇసుకను వాగులు వంకలలో గ్రామపంచాయతీ అనుమ తితో ఇసుకను తీసుకుని వెళ్లవచ్చునని స్పష్టం చేశారు. అక్రమంగా రవాణా చేస్తే మాత్రం వాహనాలు సీజ్ చేయడంతోపాటు పిడి యాక్ట్ సైతం అమలు చేస్తామన్నారు. ప్రజలకు పారదర్శకంగా ఎటువంటి యిబ్బందులు లేకుండా ఉచిత ఇనుక సరఫరాకు నిర్దేశించిన పాలసీనీ సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రజలకు ఇసుక కొనుగోలు భారం కాకూడదని, నిర్మాణ రంగానికి ఉతం ఇవ్వాలన్న ఆలోచనతో ప్రభుత్వమే ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ఇసుక లభ్యతను మెరుగు పరచడానికి అక్రమ రవాణా నిరోధించి నిర్మాణ రంగాన్ని, ప్రోత్స హించేందుకు ఉచిత ఇసుక విధానంలో మరిన్ని సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం సీనరేజ్ డిఎంఎఫ్ మెరిట్ చార్జీలు రద్దు చేయడం జరిగిందన్నారు ప్రజలు ఎవరైనా తమ గృహ నిర్మా ణాలకు అవసరమైన ఇసుకను సొంతంగా ట్రాక్టర్లు ద్వారా తీసుకొని వెళ్లవ చ్చునని ఏటువంటి అభ్యంతరాలు



ఉండవన్నారు. దూరాన్ని బట్టి రవాణా చార్జీలు వసూలు చేయాలని ఇష్టారాజ్యంగా వసూలు చేసేందుకు వీలులేదని ఆయన స్పష్టం చేశారు. వాహన నెంబరు, డ్రైవర్ పేరు, ఫోన్ నెంబర్లు గ్రామాల్లో సచివాలయ సిబ్బందినే క్రాస్ చెక్ చేయడం జరుగుతుందన్నారు. అందులో ఏమైనా వ్యత్యాసాలు ఉంటే ట్రాక్టర్లను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఆక్రమ కార్యకలాపాలకు పాల్పడినా, అధిక ధరకు ఇసుకను విక్రయించినా అటువంటివారిపై పిడి యాక్ట్ కేసులు బనాయించడం జరుగుతుందని హెచ్చ రించారు. ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలకు అవసరమైన ఇసుకను డిమాండ్ మేరకు సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిని ప్రభుత్వం ఒక బాధ్యతగా తీసుకుందని ముఖ్యమంత్రి స్థాయిలో ఉచిత ఇసుక విధానం పర్యవేక్షింపబడుతున్నదన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఆయా మార్గాల్లో చెక్ పోస్టుల వద్దా కాల్ సెంటర్ మేనేజ్మెంట్ వద్ద ఇసుక రీచ్‌లలోను జాతీయ రహదారులు వెంబడి జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ సీసీ కెమె రాలను అనుసంధానం చేసి పటిష్ట నిఘాతో తనిఖీలు నిర్వహించాలన్నారు. కాల్ సెంటర్ లేదా ఆన్లైన్ అప్లికేషన్ ద్వారా చట్ట విరుద్ధమైన ఇసుక తవ్వకాలు లేదా రవాణా పై ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉందన్నారు ప్రజలకు ఇసుక కొను గోలు భారం కాకూ డదని, నిర్మాణ రంగానికి ఊతం ఇవ్వాలన్న ఆలోచనతో ఈ విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇసుక లభ్యతను మెరుగుపరచడానికి, అక్రమ రవాణాను నిరోధించి నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించడానికి ఉచిత ఇసుక విధానంలో మరికొన్ని సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. సీనరేజ్, డి.ఎం.ఎఫ్. మెరిట్ ఫీజులకు మినహాయింపునిస్తూ కేబినెటీ నిర్ణయించిందన్నారు. నదీ తీర గ్రామాల్లోని ప్రజలు నేరుగా సచివాలయాల్లో లేదా ఆన్లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకుని ఉచితంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకెళ్లే సదుపాయం కల్పించారన్నారు. వారి అవసరాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు కనుక తీసుకెళ్తే మాత్రం అడ్డుకట్ట వేస్తామన్నారు. అక్రమ తవ్వకాలకు పాల్పడినా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాదర్శక విధానంతో ఆన్లైన్తో పాటు ఆఫ్లైన్ బుకింగ్లు కూడా చేపట్టామన్నారు. ఇసుకును తీసుకుని వెళ్లే వాహనాలు జీపీఎస్ ద్వారా ట్రాక్ చేయబడతాయన్నారు. ఏవైనా ప్రమాదాలు జరిగినా గుర్తించడంతోపాటు అక్రమాలకు పాల్పడితే ఆ వెహికల్‌ను బ్లాక్‌లో పెట్టి సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు శ్రీకర్, కే.మాధవి, కత్తిబ్ కౌసర్ భానో, గనులశాఖ అధికారి బి.అశోక్ కుమార్, రియాల్టీ ఇన్స్పెక్టర్ టి.సుజాత, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకర్రావు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, జిఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ సువిజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్కునూరు మండలానికి తీరనున్నలో ఓల్టేజ్ సమస్య



కుక్కునూర్,మేజర్ న్యూస్: మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముల్లిశెట్టి నాగేశ్వరరావు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలానికిలో వోల్టేజ్ సమస్య ఉందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధించిన అధికారులతో ఎంపీ మాట్లాడారని చెప్పారు. త్వరలోనే అల్లూరి జిల్లా ఎటపాక మండలం నుంచి గోదావరి మీదుగా 4 విద్యుత్ టవర్లను ఏర్పాటు చేసి కరెంట్ సరఫరా చేయడం జరుగుతుందని ఎంపీ మహేష్ చెప్పారని నాగేశ్వరరావు తెలిపారు. పోలవరం పరిహారం విషియంలో నిర్వాసితులు కొంతమందిలో ఆందోళనఉందని, ఎవ్వరు కూడా భయపడ్డొదని, 2019లో జరిగిన సర్వేను అనుసరించి,ఆనాటి అవార్డు జరిగిన ప్రకారమే పరిహారం అందుతుందని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో చుంచు సత్యనారాయణ పులి శ్రీనివాస్ కోటగిరి సత్యనారాయణ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## మంచినీటి శుద్ధీకరణ యంత్రం అందజేత



ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూలు విద్యార్థులు ఆరోగ్య దృష్ట్యా మోండలీజ్ (కోకోకోలా) సంస్థ వారు స్థానిక హైస్కూల్ కి విద్యార్థుల కొరకు 250 లీటర్ల సామర్థ్యం గల మంచినీటి శుద్ధీకరణ యంత్రం ఉచితంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పి.సురేష్ మాట్లాడుతూ మోండలీజ్ వారి దాతృత్వాన్ని కొనియాడారు.మోం డలీజ్ సంస్థ మేనేజర్ రాజేష్,అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర,బాబు,మనోజ్,ఆఫ్రో సంస్థ నుండి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు,ఏరియా ఫీల్డ్ సిబ్బంది శివ,రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పి సురేష్ తెలుగు పండిట్ మద్దాల పెద్దిరాజు,మల్లయ్య,రమేష్, కుమారస్వామి, శారద మొదలగు సిబ్బంది విద్యార్థులు,పాఠశాల అభివృద్ధి కమిటీ వారు మోం డలీజ్ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవోపేతంగా గరుడ వాహన సేవ









**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** చందన స్వరూపుడు వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గరుడవాహన సేవలో స్వామి వారు భక్తులకు దర్శన మిచ్చారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి కార్యక్రమాలను తిలకించి పులకించారు. పండితులు ఖండవల్లి రాజేశ్వర ప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సంకల్పము, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, శోభాయాత్రగా గోదావరీ నదీ జల సంగ్రహణ, మహాస్నపనము, ప్రధాన హెూమములు, లక్ష కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పములు, సాయంత్రం స్వస్తి వచనము, ప్రధాన హెూమములు, మహాలక్ష్మీ మూలమంత్ర పూర్వక మహాలక్ష్మీ హెూమము, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, రాత్రి మళయప్ప అలంకరణతో గరుడవాహన సేవ మొదలగు కార్యక్రమములు అత్యంత వైభవంగా జరిగాయి. స్వామివారికి ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్‌రావు మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు రామ్ బద్రిరాజు లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం దంపతులు పట్టు వస్త్రాలు అందించారు.

శోభాయమానంగా శోభాయాత్ర

కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బాణాసంచా కాల్పులు, మంగళ వాయిద్యాలు నడుమ శుక్రవారం నిర్వహించిన శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది. శ్రీవారికి తిరుమంజనంలో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు, అర్చకులు, అధికారులు గౌతమి గోదావరికి వెళ్లి గంగ పూజ చేసి నదీ జలాలు సగ్రహించి తీసుకువచ్చారు. ఈ జలాలను స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా హెూమం క్రతువులను అర్చకులు రమణీయంగా నిర్వహించారు.

# వంక సత్యం స్ఫూర్తితో ప్రజాస్వామ్య మనుగడకు మరో పోరాటం చేయాలి

**– ఆర్థిక అంశాలతో ముడిపడని రాజకీయాలు ఎక్కడా ఉండవు**
**– సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు**

**పెరవలి, మేజర్ న్యూస్ :** కమ్యూనిస్టుపార్టీ పై నిషేధం ఉన్న రోజుల్లోనే పార్టీ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించి, బడుగ బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన పోరాట యోధుడు, బడుగుల వాణిని చట్ట సభలో వినిపించిన అసెంబ్లీ టైగర్ వంక సత్యనారాయణ ఆశయ సాధనకు పునరంకితం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమర యోధులు, సీపీఐ ఉద్యమనేత, మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ వంక సత్యనారాయణ 6వ వర్ధంతి సభ అక్టోబర్ 25వ తేదీ శుక్రవారం తణుకు కామ్రేడ్ వంక సత్యనారాయణ సురాజ్య భవన్ నందు జరిగింది.సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షత వహించారు.సభలో ముప్పాళ్ళ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తాను విద్యార్థి, యువజన నాయకునిగా ఉన్న సమయంలో వంక సత్యనారాయణ తమకు మార్గదర్శకులని గుర్తు చేశారు. నాడు కమ్యూనిస్టు ఉద్యమాలు, త్యాగాలు ప్రజల్లోకి చొచ్చుకు పోయి మేధావులు, అణగారిన వర్గాలు కమ్యూనిస్టుల పిలుపు కోసం చూసేవారని నేడు ప్రజల్లో స్తబ్ధత, శూన్యత ఏర్పడిందని వంక సత్యం వంటి నాయకుల స్ఫూర్తితో ప్రజాస్వామ్య మనుగడకు మరో పోరాటం చేయాలని ముప్పాళ్ల పేర్కొన్నారు. నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని



ప్రకటించి హక్కులను హరిస్తే నేడు మోడీ అప్రకటిత ఎమర్జెన్సీతో ప్రమాదం ఏర్పడిందని ముప్పాళ్ల నిప్పులు చెరిగారు. సిపిఐ, సిపిఎం, లౌకిక పార్టీల శ్రమ ఫలితం, ప్రజల్లో చైతన్యం మూలంగానే బిజెపి మేజిక్ ఫిగర్ దాటకుండా నిలువరించామని ముప్పాళ్ల గుర్తు చేశారు. మీడియా విలువలు కోల్పోయి అధికార పక్షానికి దాసోహం అంటున్న వేళ పేదల పక్షాన లౌకికవాద మీడియా బలమయిన గొంతు వినిపిస్తుందని సోషల్ మీడియా వేదికగా ప్రజాస్వామ్య వాదులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజలకు గత్యంతరం లేక ఏదో ఒక పార్టీకి ఓటేస్తున్నారని ప్రజా సమస్యలే పరిష్కారంగా కమ్యూనిస్టు ఉద్యమాలను బలోపేతంచేసుకుంటూ ముందుకెళ్లినప్పుడు 2029 ఎన్నికల్లో కమ్యూనిస్టుల పాత్ర కీలకమవుతుందని వంక సత్యనారాయణ పోరాట స్ఫూర్తితో ఆ దిశగా ముందుకెళ్ళాలన్నారువిశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్.వి. రామారావు ప్రస్తుత రాజకీయాలు –పత్రికా విలువలు అనే అంశంపై స్మారకోపన్యాసం చేసారు. ఆర్వీఆర్ మాట్లాడుతూ విలువలు పత్రికలకేనా రాజకీయ పార్టీలకు అవసరంలేదా అని ప్రశ్నించారు. ఆర్థికాంశాల సారాంశమే రాజకీయాలని, నాటి మీడియా స్వాతంత్ర్య లక్ష్యాల కోసం పరితపిస్తే నేటి మీడియా రాజకీయ లక్ష్యం కోసం పని చేస్తున్నాయని ఆర్.వి.ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛ ఎమర్జెన్సీ కాలంలోనే కనిపించిందని, నేడు పత్రికా స్వేచ్ఛ ప్రశ్నార్థకంగా మారిందని ఆర్.వి.ఆర్. పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ మిక్సెడ్ ఎకానమి పేరుతో ఒక కాషాయాన్ని రూపొందించారని దాన్ని రూపాంతరం చెందించి పెట్టుబడిదారీ విధానంలోకి తీసుకురావడానికి పటేల్, పురుషోత్తం టాండన్ వంటి బిజెపి ఛాయలున్న నాయకులు పునాదులు నిర్మించి మోడీకి మార్గం చూపారని ఆర్.వి.ఆర్ విమర్శించారు. నేటి విధ్వంసానికి డిజిన్వెస్టుమెంటు పేరుతో అటల్ బిహారీ వాజపేయి హయంలోనే బీజం పడిందని ఆయన గుర్తు చేశారు. అనంతరం అతిథులకు వంక సత్యనారాయణ కుటుంబ సభ్యులు జ్ఞాపికలను ప్రధానం చేసి సత్కరించారు.కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సికిలే పుష్పకుమారి,ఎం.సీతారాం ప్రసాద్, కళింగ లక్ష్మణరావుతదితరులు పాల్గొన్నారు.

# ఓటు నమోదు చేయించుకోండి - ఎన్డీఏ కూటమి నేతలు



నర్సాపురం,మేజర్‌న్యూస్ : ఎన్డీఏ కూటమి పార్టీలు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుల ఆధ్వర్యంలో రేపు జరగబోయే పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా గురువారం వైన్ కాలేజీ సందర్శించి ప్రిన్సిపాల్ గ్రాడ్యుయేట్ ఓటర్లు అందర్నీ ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా అభ్యర్థించారు. అనంతరం సాయంత్రం స్థానిక సూర్య కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ ని కాలేజీలో వారి స్టాఫ్ ను కలిసి పట్టభద్రుల ఓటును నమోదు చేసుకోవాల్సిందిగా అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ,బిజెపి పట్టణ అధ్యక్షులు మునుకోటి వెంకటేశ్వరావు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కొప్పర్తి వెంకట్, పట్టణ ప్రధాన కార్యదర్శి అగ్నిహెూత్రం రవికిరణ్, ఓబిసి మోర్చ రాష్ట్ర సీనియర్ న్యాయవాది వనమాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు ధర్నా

బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్: శానిటేషన్ వర్కర్స్ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ సెప్టెంబర్ రెండో తేదీన ప్రభుత్వం జీవో నెంబర్ 413ని విడుదల చేసిందని జీవో ప్రకారం స్కూల్ శానిటేషన్ వర్కర్స్, నైట్ వాచ్మెన్‌ల వేతనాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. విద్యార్థులు ఎక్కువమంది ఉండటంవల్ల పని భారం ఎక్కువ అవుతుందని తెలియజేశారు.

శానిటేషన్ వర్కర్లకి ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని గుర్తింపు కార్డులో ఇవ్వాలని రెండు జతల యూనిఫాం, గ్లౌజులు మాస్కులు తదితర వస్తువులు అందజేయాలని కోరారు. శానిటేషన్ వర్కర్లను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఏడి షరీఫ్‌కి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట లక్ష్మి, రత్న కుమారి, నాగమణి, మంగ,సంధ్య,సోమాలమ్మ, రామలక్ష్మి, గంగాదేవి తదితరులు ఉన్నారు.

# ఆర్అండ్ఆర్ అవకతవకలపై విచారణ చేపట్టాలి



వేలేరుపాడు,మేజర్ న్యూస్ : ఆర్అండ్ఆర్ లిస్టులో నిర్వాసితుల పేర్లు గల్లంతు చేసిన వారిపై విచారణ చేపట్టాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి యస్ కె గౌస్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జగన్నాథ పురం గ్రామంలో 144 మంది నిర్వాసితుల పేర్లు గల్లంతు చేసిన వారిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్ఆర్ చెల్లించడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. మండలంలోని అన్నీ గ్రామాల ఆర్ అండ్ ఆర్ లిస్టు బహిరంగం చేయాలని కోరారు.పూర్వం నుండి గ్రామాల్లో నివాసం ఉంటున్న నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.అర్హులైన ప్రతిఒక్క నిర్వాసితునికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి సోయం చందరావు, ముత్యాలరావు, రామారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలతో విద్యాశాఖ అధికారుల సమీక్ష



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో సమీక్ష సమావేశం నిర్వహించిన మండల విద్యాశాఖ అధికారులు వి.హనుమ, జ్యోతి. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అపార్ కార్డులు ప్రక్రియ, యుడైస్ ప్లస్ ,ఎస్ఎస్ఎంపి పరీక్షలు,మార్కుల నమోదు ప్రక్రియ తదితర అంశాలపై చర్చించిన మండల విద్యాశాఖ అధికారులు హాజరైన వారికి తగు సూచనలు ఇచ్చారు. వివిధ అంశాల నమోదు విషయంలో ప్రైవేటు విద్యాసంస్థలు అలసత్వం చూపరాదని తెలియజేశారు.